ఇదేం తీరు?

మంత్రి పర్యటనలో బయటపడ్డ ఎమ్మెల్యేల అసంతృప్తి

పుంగనూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేల అసంతృప్తి పార్టీ శ్రేణుల సాక్షిగా బయటపడింది.పుంగనూరు మండలం కృష్ణాపురంలో టీడీపీ కార్యకర్త రామకృష్ణను అక్కడి వైసీపీ కార్యకర్త వెంకట్రరమణ ఇటీవల నరికి చంపిన విషయం తెలిసిందే. గురువారం రామకృష్ణ పెద్దకర్మ కార్యక్రమం ఉండడంతో ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు వెళ్లి రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించాలని పార్టీ ఆదేశించింది. దీంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి విజయవాడ నుంచి బెంగళూరు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డుమార్గంలో కృష్ణాపురానికి ఉదయం 9.50 గంటలకల్లా వెళ్లారు. ఉదయం 10 గంటలకు రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించాలనుకున్నా.. ఆ సమయానికి అక్కడికి జిల్లా ఎమ్మెల్యేలు చేరుకోలేదు. పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి మాత్రమే మంత్రికి ఆహ్వానం పలికారు. అప్పటి వరకు మంత్రి అదే గ్రామంలోని ఓ కార్యకర్త ఇంటి వద్ద ఉంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. చిత్తూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, మురళీమోహన్ పలమనేరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఇంటి వద్దకు చేరుకుని అక్కడే టిఫిన్ చేశారు. అక్కడి నుంచి బయల్దేరి 11.30 గంటలకు కృష్ణాపురం చేరుకున్నారు. అప్పటి వరకు మంత్రి వారి కోసం వేచి చూశారు. ఎమ్మెల్యేలు వస్తున్న సమయంలో మంత్రి పక్కనే ఉన్న చనిపోయిన రామకృష్ణ ఇంటి వద్దకు వెళ్లారు. ఎమ్మెల్యేలను నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆహ్వానించారు.తరువాత మంత్రి, ఎమ్మెల్యేలంతా రామకృష్ణ చిత్ర పటానికి నివాళులర్పించారు.ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. తర్వాత ముందే ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్ శిబిరం వద్దకు చేరుకోవాల్సి ఉండగా.. ఇన్‌ఛార్జి చల్లా అందర్నీ పిలిచారు. మంత్రి ప్రెస్‌మీట్ వద్దకు చేరుకుని ఎమ్మెల్యేల కోసం మళ్లీ 10 నిమిషాల పాటు వేచి చూశారు. తొలుత మంత్రి 3 నిమిషాలు మాట్లాడారు. ఎమ్మెల్యేల తరఫున మాట్లాడాలని చిత్తూరు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కోరారు. దీంతో ఆయన కోప్పడ్డారు. 'మంత్రి మాట్లాడేశారు కదా, నేను ఏందీ మాట్లాడేది' అని అక్కడి నుంచి లేచి వెళ్లిపోయారు. దీంతో అక్కడున్న మిగిలిన ఎమ్మెల్యేలు కూడా ప్రెస్‌మీట్‌లో మాట్లాడలేదు. ఎవరిపాటికి వాళ్లు వెళ్లిపోయారు. ఆఖరులో మంత్రి వెళ్లారు.వాస్తవానికి వైసీపీ ఐదేళ్ల పాలనలో పుంగనూరులో టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీ అగ్ర నేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి వర్గీయుల చేతిలో నలిగిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా టీడీపీ కార్యకర్తను వైసీపీ కార్యకర్త హత్య చేయగలిగాడంటే అక్కడి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో పుంగనూరుకు ఎమ్మెల్యేలంతా వెళ్లి కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపాలని పార్టీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేశ్ సూచించారు. కానీ, పుంగనూరులో గురువారం జరిగిన ఎమ్మెల్యేల తీరు భరోసా కంటే నిరుత్సాహాన్నే మిగిల్చింది. కార్యకర్తల్లో భరోసా నింపుతారనుకుంటే అంతర్గత విబేధాలు బయటపెట్టుకున్నారని స్థానిక టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

కార్యకర్తల కోసం ఎంతదూరమైనా వెళతాం



రామకృష్ణ కుమారుడు శివతో మాట్లాడుతున్న రాంప్రసాద్ రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- ఎమ్మెల్యేలతో కలసి రామకృష్ణ కుటుంబానికి పరామర్శ
- కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తామని హామీ



రామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

పుంగనూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి):టీడీపీకి పునాదులైన కార్యకర్తలను కాపాడుకునేందుకు ఎంత దూరమైనా వెళతామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు.పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురంలో ఇటీవల వైసీపీ కార్యకర్త చేతిలో దారుణహత్యకు గురైన టీడీపీ కార్యకర్త కె.రామకృష్ణ కర్మక్రియల్లో మంత్రి పాల్గొన్నారు.ఎమ్మెల్యేలు ఎన్.అమరనాథరెడ్డి, పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, కె.మురళీమోహన్, ఎస్.షాజహాన్‌బాషా, పుంగనూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు చల్లా రామచంద్రారెడ్డి, జయచంద్రారెడ్డి,తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల టీడీపీ అధ్యక్షులు జగన్మోహన్‌రాజు, సీఆర్.రాజన్ తదితరులతో కలసి రామకృష్ణ ఇంటివద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి నివాళులర్పించారు.ఆయన భార్య ఉమాదేవి, కుమారులు శివ, సురేశ్ కుమార్‌లతో మాట్లాడి వారి పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి, ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి టీడీపీకి రామకృష్ణ సేవలను గుర్తుచేశారు.సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ మీకు ధైర్యం చెప్పి భరోసా ఇవ్వాలని ఆదేశించడంతో తాము ఇంతమంది మీ ఇంటికి వచ్చామని, దీన్ని మీరు అర్థం చేసుకోవాలన్నారు.10 రోజుల్లో రామకృష్ణ కుటుంబాన్ని చంద్రబాబు, లోకేశ్ వద్దకు తీసుకెళతామన్నారు. మూడు రోజుల్లో కొంత ఆర్థికసహాయం అందిస్తామని వివరించారు. ఏ చిన్న ఇబ్బంది వచ్చినా ఫోన్ చేయండని భరోసా ఇచ్చారు. రామకృష్ణ కుటుంబానికి ఎమ్మెల్యేలు, రాజన్ కొంత నగదు సహాయం చేశారు.అయితే తమకు న్యాయం కావాలని, రామకృష్ణ హంతకులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు.అనంతరం మీడియా సమావేశంలో రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటామని, అర్హతను బట్టి ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో బాటు ఆర్థికంగా ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.అనంతరం కృష్ణాపురం వచ్చిన మదనపల్లె ఎమ్మెల్యే ఎస్.షాజహాన్‌బాషా మాట్లాడుతూ రామకృష్ణ కుటుంబానికి మూడు రోజుల్లో మదనపల్లె సమీపంలోని నవోదయ విద్యాలయం వద్ద ఒక కుంట నివాస స్థలాన్ని పట్టా ఇప్పిస్తానని తెలిపారు. చౌడేపల్లె, పుంగనూరు మండలాల టీడీపీ అధ్యక్షులు గువ్వల రమేశ్‌రెడ్డి, మాధవరెడ్డి, టీడీపీ నాయకులు సీడ్ మల్లిఖార్జున నాయుడు, సీవీరెడ్డి, పోలీస్‌గిరి, రవి, రాజశేఖర్, రాఘవ, అమరనాథ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అలీప్ శిక్షణ సమావేశంలో ప్రసంగిస్తున్న భువనేశ్వరి




మహిళా పారిశ్రామికవేత్తలదే భవిష్యత్తు

- నారా భువనేశ్వరి

కుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):మహిళా పారిశ్రామికవేత్తలదే భవిష్యత్తు అని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. కుప్పంలో అలీప్ ఆధ్వర్యంలో మహిళలకు ఆరు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఆమె గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా తనకూ అలీప్‌కూ ఎంతో అనుబంధముందన్న భువనేశ్వరి ఈ సంస్థ తన ముందే చిన్నమొక్కగా ఏర్పడి, మహావృక్షమైందని చెప్పారు. అలీప్ చైర్‌పర్సన్ రమాదేవి చాలాకాలంగా తెలుసని, మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడంలో ఈ సంస్థకు ఎంతో అనుభవముందన్నారు.మహిళలు అనుకుంటే సాధించలేనిది లేదన్నదానికి తానే ఒక ఉదాహరణ అని చెప్పారు. 'గృహిణిగా వున్న నన్ను చంద్రబాబు హెరిటేజ్‌కు ఎండీని చేశారు. నేను ఎవరి దగ్గరా శిక్షణ పొందలేదు. నాకు నేనుగా నేర్చుకుని ముందుకు సాగుతున్నా' అని స్వయం అనుభవాన్ని వివరించారు. పట్టుదల పడితే, మగాళ్లకంటే ఎక్కువగా పనిచేసే శక్తి మహిళలకే ఉందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకోసం కుప్పంలో అలీప్ ఏర్పాటు కాబోతున్నదని, ఇందుకోసం చంద్రబాబు 20 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే కడా ఆధ్వర్యంలో కేటాయించారని గుర్తు చేశారు. దీనిద్వారా మహిళలు ఎందరో శిక్షణ పొంది, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతారన్నారు.'నాకు ఐఏఎస్ అధికారులతో మాట్లాడే అలవాటు లేదు. కానీ మీకోసం నేను కడా పీడీ వికాస్ మర్మత్‌గారితో తరచూ మాట్లాడుతున్నా.మా కుప్పం మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఆయన ఏమేం చేస్తున్నారో, చేయగలరో అడిగి తెలుసుకుంటున్నా' అని భువనేశ్వరి చెప్పారు. కుప్పం పరిధిలో పెద్ద పరిశ్రమలతోపాటు చిన్న తరహా పరిశ్రమలు కూడా రాబోతున్నాయన్నారు. ఆయా పరిశ్రమలను మహిళలే స్థాపించాలని, వాటిలో కుప్పం నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పించాలని భువనేశ్వరి ఆకాక్షించారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం మాట్లాడుతూ అలీప్ ద్వారా మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇస్తున్న శిక్షణ అద్భుతాలు సృష్టిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కడా పీడీ వికాస్ మర్మత్ మాట్లాడుతూ అలీప్ అనేది ముఖ్యమంత్రి చంద్రబాబు డ్రీమ్ ప్రాజెక్టు అన్నారు. శిక్షణ పొంది తర్వాత ఏదో ప్రాజెక్ట్ పెట్టేశామంటే ఎదగలేరని, దానికి ముందు సమగ్ర సర్వే చేసి ప్రాజెక్ట్ ఏర్పాటు, వ్యయం, మనదగ్గరున్న బడ్జెట్టు, భవిష్యత్తులో పొందబోయే లాభాలు వంటివన్నిటి గురించి ప్రణాళిక సిద్ధం చేసుకుని మరీ ముందడుగు వేయాలని సూచించారు. కుప్పంలో త్వరలోనే అలీప్ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ పార్కు తీసుకొస్తామని చెప్పారు. అలీప్ చైర్‌పర్సన్ రమాదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి పిలుపుతో ఇక్కడ మహిళలను సాధికారత దిశగా నడిపించడానికి ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం 20 ఎకరాల స్థలాన్ని కేటాయించినందుకు ప్రభుత్వానికి, కడా పీడీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు, అలీప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల ఊరేగింపు

- నిమజ్జనంతో ముగిసిన గంగజాతర
- ప్యాలెస్‌కు చేరిన సుగుటూరు గంగమ్మ



నిమజ్జనానికి ఊరేగింపుగా వెలుతున్న సుగుటూరు గంగమ్మ, నడివీధి గంగమ్మ

పుంగనూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రెండురోజుల పాటు వైభవంగా జరిగిన సుగుటూరు గంగమ్మ జాతర గురువారం ఉదయం నిమజ్జనంతో ముగిసింది. మంగళవారం జమిందారుల తొలిపూజతో జాతర ప్రారంభమైంది.రాత్రి ఊరేగింపు అనంతరం బుధవారం ప్యాలెస్ ఆవరణలోని సుగుటూరు గంగమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.పుంగనూరుతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు వివిధ రకాల వేషధారణతో గెరిగెలు మోస్తూ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.గురువారం తెల్లవారుజామున గంగమ్మను ఆలయం నుంచి వెలుపలకు తెచ్చి నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళుతుండగా బజారువీధిలోని నడివీధి గంగమ్మ, మైసూర్‌బ్యాంకు వద్ద కొలువుదీరిన మల్లారమ్మ కలిశారు.సుబేదారు వీధి, తేరువీధి మీదుగా తూర్పుమొగసాలలోని చౌడేశ్వరిదేవి ఆలయం వరకు మంగళవాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల, ఆసాదివారి కథలతో గంగమ్మలు ఊరేగింపుగా వెళ్లారు. చాముండేశ్వరిదేవి ఆలయానికి మల్లారమ్మ వెళ్లి అమ్మవారిని పలకరించి వెనుదిరిగారు. అమ్మవారికి ఎనుబోతును బలిచ్చిన తోటి కులస్తులు దాని తలను చాటలో పెట్టుకుని తీసుకెళ్లారు.చాముండేశ్వరి గుడి ఎదురుగా ఉన్న కోనేరులో నీరు లేకపోవడంతో డ్రమ్ముల్లోని నీటితో సుగుటూరు గంగమ్మ, నడివీధి గంగమ్మల నిమజ్జన కార్యక్రమాన్ని గూడూరుపల్లె పూజారులు పూర్తి చేశారు. నిమజ్జన కార్యక్రమం ముగియగానే సుగుటూరు గంగమ్మ విగ్రహాన్ని ఎవరికీ కనిపించనీయకుండా వస్త్రాలతో చుట్టి ప్యాలెస్‌కు తీసుకొచ్చి భద్రపరిచారు. అలాగే అమ్మవారి శిరస్సు రంగారెడ్డి ఇంటికి, నడివీధి గంగమ్మ బజారువీధికి వెళ్లాయి. ప్యాలెస్‌లో పూజారులు అమ్మవారికి అలంకరించిన అభరణాలను జమీందారు వంశీకులకు అప్పగించి పూజలు చేశారు. అనంతరం జమీందారు వంశీకుల మలి పూజతో సుగుటూరుగంగమ్మ ప్యాలెస్ గృహనిర్బంధంలోకి వెళ్లడంతో జాతర ముగిసింది. మున్సిపల్ కమిషనర్ మధుసూదన రెడ్డి, డీఎస్పీ ప్రభాకర్, సీఐలు రాంభూపాల్, ఉమామహేశ్వర్‌రావు, ఎస్‌ఐ లోకేశ్ నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు.జాతర ఘనంగా నిర్వహించిన సుగుటూరు గంగమ్మ సేవా సంఘ సభ్యులను జమీందారు వంశీకులు, అధికారులు అభినందించారు.

పట్టపగలే ఒంటరి ఏనుగు హల్‌చల్



పేరావాండ్లపల్లి వద్ద రోడ్డు దాటుతున్న ఒంటరి ఏనుగు

కల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ పేరావాండ్లపల్లి వద్ద గురువారం పట్టపగలే ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది.బోడబండ నుంచి బుధవారం రాత్రి ఏనుగు మండలంలోకి ప్రవేశించింది.దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లి మీదుగా వీకేపల్లి వద్దకు చేరుకుంది. విషయం తెలుసుకున్న ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ సిబ్బందితో అక్కడకు చేరుకొని స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు. వీకేపల్లిలోని రైతు చిన్నదొరస్వామినాయుడు మామిడితోటకు అమర్చిన రాతి కూసాలను ఒంటరి ఏనుగు విరిచేసింది. అక్కడి నుంచి పెద్ద బెస్తపల్లి, అయ్యావాండ్లపల్లి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లి సమీపంలోని కృష్ణమ్మచెరువు వద్దకు చేరుకుంది. చెరువులోని నీటిలో కొంత సమయం గడిపిన ఏనుగు పులిచెర్ల-రొంపిచెర్ల రోడ్డును దాటుకొని చిచ్చిలివారిపల్లి వద్దకు చేరుకుంది. అనంతరం తురకపేట, వంకమద్దివారిపల్లి మీదుగా ఉదయం 8 గంటల సమయానికి పేరావాండ్లపల్లి వద్దకు చేరుకుంది. అప్పటికే అక్కడకు చేరుకున్న అటవీశాఖ సిబ్బంది ప్రజలను ఏనుగు సమీపానికి వెళ్లనీయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అక్కడకు చేరుకున్న ప్రజలను గమనించిన ఒంటరి ఏనుగు గ్రామానికి సమీపంలోని తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోకి చేరుకుంది. రాత్రంతా మండలంలో తిరిగిన ఒంటరి ఏనుగు పలు మామిడిచెట్లను ధ్వంసం చేసినట్లు ప్రజలు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎఫ్ఎస్‌వో

ఒంటరి ఏనుగు సంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ హెచ్చరించారు. ఎక్కడైనా ఒంటరి ఏనుగు ప్రజలకు కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గజరాజుల బీభత్సం

- ధ్వంసమైన పంటలు, వ్యవసాయ పరికరాలు
- పేయ దూడను తొక్కి చంపేసిన ఒంటరి ఏనుగు



ఏనుగులు తొక్కేసిన వరి పంట, విరిచేసిన బోరుబావి పైపులు

యాదమరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలంలోని దళవాయిపల్లె వద్ద బుధవారం రాత్రి 14 ఏనుగులతో కూడిన గుంపు బీభత్సం సృష్టించింది. గ్రామానికి చెందిన రైతులు, రవి, ప్రసాద్, అశోక్, బాబు, చిన్నదొరలకు చెందిన వరి, కొబ్బరి, మామిడి, అరటి పంటలను, గజేంద్ర, వాసులకు చెందిన వ్యవసాయ బోరు బావి పైపులు, నీటి సరఫరా వ్యవస్థను, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో గుంపు నుంచి విడిపోయిన ఒంటరి ఏనుగు దళవాయిపల్లె సమీపంలోని రైతు మణికి చెందిన పేయ దూడను తొక్కి చంపేసింది. అలాగే రాచూరు బీట్ పరిధిలో పెరగాండ్లపల్లె, యలమూరు, రాచూరు వద్ద నాలుగు ఏనుగులు సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. సమాచారం అందుకున్న వెస్ట్ ఫారెస్ట్ రేంజ్ ఇన్‌చార్జి సంకేత్ గరుడ్, ఎఫ్ఎస్‌వో మోహన్ మురళి, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది ఏనుగులు నాశనం చేసిన పంటలను, మృతిచెందిన దూడను పరిశీలించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అటవీశాఖ ఆధ్వర్యంలో యాదమరి వెటర్నరి వైద్యురాలు డాక్టర్ సంధ్యారాణి సంఘటన స్థలంలోనే దూడకు పోస్టుమార్టం నిర్వహించారు.

హడలిపోతున్న రైతులు

ఏనుగుల వరుస దాడుల నేపథ్యంలో అటవీ సమీప గ్రామాల రైతులు హడలిపోతున్నారు. కళ్ల ముందే పంటలు ధ్వంసమవుతున్నా కాపాడుకోలేక కన్నీరు పెడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని పెంచాలని కోరుతున్నారు. ఏనుగుల దాడుల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

20 రోజుల్లో కుంకీ ఏనుగులను రప్పిస్తాం

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



గజ బాధితులకు పరిహార చెక్కులను అందజేస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు వద్ద ఎలిఫెంట్ టూరిజం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. 20 రోజుల్లో కుంకీ ఏను గులను రప్పిస్తామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో పలమనేరు ప్రాంతంలో ఏనుగుల కారణంగా నష్టపోయిన 195 మందికి పరిహార చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏనుగుల సంచారాన్ని ముందుగానే రైతులు కనుగొనేందుకు అటవీశాఖ ఓ యాప్‌ను తయారు చేస్తోందన్నారు. ఇప్పటి వరకు ఏనుగుల దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం అటవీ సరిహద్దుల్లో కందకాలు తవ్వించడం, సోలార్ విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే ఏనుగులు తెలివిగా కూల్చివేసి వాటిని దాటి వస్తున్నాయని తెలిపారు. సత్ఫలితాలు ఇస్తున్న హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌ను కొంతమేర ఏర్పాటు చేశారని.. పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.పలమనేరు వద్ద సంచరించే మదపుటేనుగులను అదుపు చేసేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెప్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకోసం మొసలిమడుగు సమీపంలో ఎలిఫెంట్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మరో 15 నుంచి 20 రోజుల్లో కుంకీ ఏనుగులను ఇక్కడికి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, రేంజర్ నారాయణ, సుకుమార్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

పీఈఎస్‌లో 27 వారాల శిశువుకు అధునాతన వైద్యం



తల్లీబిడ్డతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న పీఈఎస్ వైద్య ప్రముఖులు

కుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని పీఈఎస్ ఆసుపత్రిలో 27 వారాల శిశువుకు అధునాతన వైద్యం అందించి వైద్యులు ప్రాణాలు కాపాడారు. పీఈఎస్ ఆసుపత్రి చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రాజేంద్రనాయుడు, డాక్టర్ హరిచంద్ర, ఎన్ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ దీప్తిల మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ ఎన్‌కే.సుబ్రమణ్య మార్గదర్శకత్వంలో చేసిన వైద్య సేవలు విజయవంతమయ్యాయి. వైద్య ప్రముఖులు వెల్లడించిన వివరాలు ఇలా.. ఎస్‌ఆర్‌పురం మండలం జంగాలపల్లె గ్రామానికి చెందిన రోషిణిని ఆమె భర్త మక్బుల్ ప్రసవం కోసం జనవరి 18వ తేదీన పీఈఎస్ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు రోషిణిని పరీక్షించి గర్భంలో శిశువు బరువు చాలా తక్కువ ఉందని గుర్తించారు. అయినా తల్లికి, శిశువుకు ఎలాంటి ప్రమాదం జరుగకుండా ముందస్తు ప్రసవం చేశారు. సాధారణంగా 40 వారాలు నిండిన తర్వాతనే ప్రసవం చేస్తారు. అయితే 27 వారాలకే నొప్పులు రావడంతో ఇలా ముందస్తు ప్రసవం చేయాల్సి వచ్చింది. రోషిణికి మగ శిశువు జన్మించింది. ప్రసవ సమయంలో శిశువు బరువు కేవలం 740 గ్రాములు మాత్రమే ఉంది. కానీ శిశువు అనేక రుగ్మతలు (ఇన్‌ఫెక్షన్, అధిక రక్త హీనత, శ్వాసకోశ వ్యాధులు, కంటి అభివృద్ధి లోపం, నరాల బలహీనత, అతి తక్కువ బరువు) కలిగి ఉండటంతో శిశువును వెంటనే ఎన్ఐసీయూకు తరలించి అత్యుత్తమ అధునాతన వైద్య సేవలు అందించారు. సుమారు మూడు నెలలుగా అందించిన వైద్య సేవలు ఫలించి ఇప్పుడు తల్లీ శిశువు ఆరోగ్యంగా ఉన్నారు.

ఆ రైతుల ఖాతాలకు వచ్చేనెల 30లోగా ఈకేవైసీ పూర్తిచేయండి : జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో నిరర్థకంగా ఉన్న 14వేల మంది రైతుల ఖాతాలకు వచ్చేనెల 30లోగా ఈకేవైసీ పూర్తిచేయాలని జేసీ, బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి విద్యాధరి సూచించారు. గురువారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పాలకవర్గ సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ.. నిరర్థక ఆస్తుల శాతాన్ని నాబార్డు ఆదేశాలతో ఐదు శాతం కంటే తగ్గించాలన్నారు. జిల్లాలో బంగారు కుదువ పెడుతున్న రైతులు ఎక్కువ సంఖ్యలో ఖాతాలు నిర్వహిస్తుంటే, వాటిపై దృష్టి సారించాలని చెప్పారు. రామకుప్పం, పెనుమూరు సింగిల్ విండోలను సమీప బ్యాంకు బ్రాంచ్‌లకు అనుసంధానం చేస్తూ తీర్మానించారు. సూపర్‌వైజర్లలో జవాబుదారీతనం మరింత పెంచేలా ఆర్బీఐ, నాబార్డు సూచనలను అమలుచేయాలని చెప్పారు. సింగిల్ విండోల కంప్యూటరీకరణ ప్రక్రియ ఆదివారంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. సీఈవో శంకర్‌బాబు మాట్లాడుతూ.. నిరర్థక ఆస్తులు రూ.90 కోట్ల నుంచి రూ.70 కోట్లకు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డీసీవో నాగవర్ధన, బ్యాంకు అధికారులు మనోహర్ గౌడ్, లిల్లీ కేథరిన్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోటాలో 1,100 టన్నుల కోత

పూర్తిగా ఇవ్వాలని ప్రభుత్వానికి లేఖ రాశామన్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రజా పంపిణీ వ్యవస్థ కుప్పకూలింది. అప్పటి వైసీపీ మద్దతుదారులైన డీలర్లు ఇష్టారాజ్యంగా నిత్యావసర వస్తువులను పక్కదారి పట్టించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో పంపిణీ చేశాక నిల్వ ఉన్న స్టాకును గుర్తించింది. ఈ మూడు నెలల్లో డీలర్ల వద్ద 1,100 టన్నుల బియ్యం ఉజ్జాయింపుగా నిల్వ ఉన్నట్లు గుర్తించింది. జిల్లాకు ప్రతినెలా 5,36,686 మంది కార్డుదారుల కోసం 8,500 టన్నుల బియ్యాన్ని కేటాయిస్తారు. అయితే డీలర్ల వద్ద ప్రభుత్వం గుర్తించిన 1,100 టన్నుల నిల్వను మినహాయించి, 7,400 టన్నుల బియ్యాన్ని ఏప్రిల్ నెలకు కేటాయించింది. అలాగే 260 టన్నుల పంచదారకుగాను ఏప్రిల్‌నెలకు 212 టన్నులు మాత్రమే కేటాయించింది. దీనిపై గురువారం 'ఆంధ్రజ్యోతి'తో జేసీ విద్యాధరి మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని చెప్పారు. జిల్లాకు కోత పెట్టిన 1,100 టన్నులను విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు.

రూ.31.98 కోట్ల మిగులుతో బడ్జెట్

అంచనాలకు కార్పొరేషన్ కౌన్సిల్ ఆమోదం





సమావేశానికి హాజరైన చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు - ప్రసంగిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ 2025-26 సంవత్సర బడ్జెట్‌ను రూ.31.98 కోట్ల మిగులుతో అంచనాలను తయారు చేయగా గురువారం కౌన్సిల్ ఆమోదించింది. నగరపాలక సమావేశ మందిరంలో మేయర్ అముద అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. తొలుత బడ్జెట్‌లోని అంశాలను కమిషనర్ నరసింహ ప్రసాద్ సభ్యులకు వివరించారు. ప్రారంభపు నిల్వగా రూ.30.54 కోట్లు, జమల కింద రూ.277.06 కోట్లు వెరసి రాబడి రూపంలో మొత్తం రూ.307.6 కోట్లను, వ్యయ పద్దు కింద రూ.275.62 కోట్లను చూపారు. ఇందులో ఎస్సీ కులాల వారికి రూ.3.58 కోట్లు, ఎస్టీలకు రూ.1.79 కోట్లు, స్త్రీ శిశు సంక్షేమానికి రూ.1.19 కోట్లు, విభిన్న ప్రతిభావంతులకు రూ.71.67 లక్షలు, మురికివాడల అభివృద్ధికి రూ.9.55 కోట్లుగా కేటాయింపులు చేశారు. ఆదాయం పద్దులో రూ.43.50 కోట్లు నగరపాలక సంస్థకు రావచ్చని పొందుపరిచారు. ఆస్తి పన్ను, పబ్లిక్ జనరల్ ట్యాక్స్‌లో రూ.14.83కోట్ల రాబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో ఖాళీ స్థలాలపై పన్నుల రూపంలో రూ.3.59 కోట్లు, ప్రభుత్వ భవనాలపై ఆస్తి పన్నుల రూపంలో రూ.9.66 కోట్లు, నీటి ట్యాక్స్ కింద రూ. 5.93 కోట్లు, డ్రైనేజీ పన్నుగా రూ.3.94కోట్లు, లైటింగ్ పన్నుగా రూ.1.98 కోట్లు, ప్రకటనల పన్నుల రూపంలో రూ.22లక్షలు రావచ్చని అంచనాలను తయారు చేశారు. రాబడి రూపంలో స్టాంపు డ్యూటీగా ప్రభుత్వం నుంచి రూ.7 కోట్లు, వినోదపు పన్ను కింద రూ.3లక్షలు, అద్దెల ద్వారా రూ.2.78కోట్లు, యూజర్ చార్జీల కింద రూ.3.70 కోట్లు, ఇతరత్రా మొత్తం ఆదాయం రూపంలో రూ.2.78 కోట్లు రావచ్చని చూపారు. ఎంపీ ల్యాడ్స్ కింద రూ.కోటి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.70లక్షలు, అమృత్ పథకం కింద పార్కుల అభివృద్ధికి రూ.2కోట్లు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌గా రూ.2కోట్లు రావచ్చని బడ్జెట్‌లో పొందుపరిచారు.

కలిసికట్టుగా నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం

అధికారులతో సమన్వయం చేసుకుని కలిసికట్టుగా నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని సభ్యులకు మేయర్ అముద పిలుపునిచ్చారు. కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం నగరపాలక సంస్థ సమావేశపు మందిరంలో మేయర్ అధ్యక్షతన జరిగింది. కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ప్రధానంగా అజెండాలోని అంశాలపై చర్చించారు. నగరంలోని కాసు బ్రహ్మానందరెడ్డి పాత బస్టాండ్ పీపీపీ మెడల్‌లో అభివృద్ధి చేయడానికి, బహుళ వాణిజ్య సముదాయాన్ని నిర్మించడానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఇచ్చిన లేఖ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారి ఆదేశాలు పొందటానికి ఆమోదించారు. కూరగాయల మార్కెట్, జంతువధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానందరెడ్డి బస్టాండ్‌లను 2025-26 సంవత్సరానికి సంబంధించి వేలంపాటలో హెచ్చుపాటదారులకు కేటాయించడాన్ని ఆమోదించారు. అలాగే ఏఎస్ఎం, ఎంఎస్ఆర్ కాంప్లెక్సు, గిరింపేట మీ-సేవ బిల్డింగ్ పరిధిలో ఖాళీగా ఉన్న గదులను హెచ్చుపాటదారులకు కేటాయించడానికి అంగీకరించారు. టేబుల్ అజెండా ద్వారా రెడ్డిగుంట బాలాజీ హేచరీస్ ఎదురుగా ఉన్న ప్రాంతాన్ని సుందర్‌నగర్‌గా, కలెక్టరేట్ వెనుక ఉన్న ప్రాంతాన్ని సుజీవ నగర్‌గా పేరు పెట్టడానికి సభ ఆమోదించింది. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎక్స్ అఫిషియో మెంబర్ల గైర్హాజరు

బడ్జెట్ సమావేశానికి ఎక్స్ అఫిషియో మెంబర్ల హోదాలో ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీ మోహన్ పుంగనూరు పర్యటనలో వుండడం వల్ల హాజరు కాలేదు.

రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీ టీడీపీ కైవసం





ఎన్నికల అధికారి శ్రీనివాసులురాజు నుంచి డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న ఎంపీపీ సులోచన, వైస్ ఎంపీపీ వెంకట్రామగౌడు

రామకుప్పం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రామకుప్పం ఎంపీపీ, రెండో వైస్ ఎంపీపీ పదవులను టీడీపీ చేజిక్కించుకుంది. మూడున్నరేళ్లకు పైగా ఖాళీగా ఉన్న ఈ పదవులకు గతంలో ఐదు సార్లు ఎంపీటీసీలెవరూ హాజరుకాక పోవడంతో ఎన్నికలు వాయిదాపడ్డాయి.గురువారం ఆర్డీవో శ్రీనివాసులురాజు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. 2021లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ పోటీనుంచి వైదొలగడంతో 16 ఎంపీటీసీ స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థులే గెలిచారు. ఎంపీపీగా ఉన్న శాంతకుమారి 2021 డిసెంబరు 12న అనారోగ్యంతో మృతి చెందగా వైస్ ఎంపీపీ సుబ్రహ్మణ్యం ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.రెండో వైస్‌ఎంపీపీ పదవి తొలినుంచీ ఖాళీగానే వుంది. ఇటీవల వైసీపీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీలు టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో గురువారం నాటి ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది.ఏడుగురు ఎంపీటీసీలతో టీడీపీ , మిగిలిన 8మంది ఎంపీటీసీలతో వైసీపీ క్యాంపులు నిర్వహించాయి. టీడీపీలో చేరిన ఏడుగురు ఎంపీటీసీలు గురువారం 10గంటల ప్రాంతంలో ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన మండల సచివాలయానికి చేరుకున్నారు.మధ్యాహ్నం ఒంటిగంట దాటినా వైసీపీకి చెందిన 8మంది ఎంపీటీసీలు రాలేదు. కర్ణాటక సరిహద్దు గ్రామం రాజుపేటక్రాస్‌లో ట్రాఫిక్ స్తంభించడం, స్థానికులు అక్కడ నెలకొన్న తాగునీటి సమస్యపై రోడ్డుపై బైఠాయించడంతో పోలీస్ ఎస్కార్టుతో ఎంపీటీసీలు వస్తున్న పోలీస్ వ్యాన్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. దీంతో వారు మధ్యాహ్నం 1.25గంటల ప్రాంతంలో మండల సచివాలయానికి చేరుకున్నారు. అప్పటికే ఎంపీపీ, రెండో వైస్ ఎంపీపీ ఎన్నిక ముగిసినట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎంపీపీగా ఉన్సిగానిపల్లె ఎంపీటీసీ సులోచన పేరును విజలాపురం ఎంపీటీసీ వెంకట్రామగౌడు ప్రతిపాదించారు. సులోచనమ్మతో పాటు మిగిలిన ఆరుగురు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ చేతులు పైకెత్తారు. వైస్ ఎంపీపీగా విజలాపురం ఎంపీటీసీ వెంకట్రామగౌడు పేరును సింగసముద్రం ఎంపీటీసీ అశ్విని ప్రతిపాదించగా ఆయనతో బాటూ ఐదుగురు ఎంపీటీసీలు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ చేతులెత్తారు. దీంతో సులోచన ఎంపీపీగా, వెంకట్రామగౌడు రెండో వైస్ ఎంపీపీగా గెలుపొందినట్టు ఎన్నికల అధికారి డిక్లరేషన్ ఫారాలు అందజేశారు.

ఎంపీపీ ఎన్నిక అప్రజాస్వామికం : వైసీపీ

వి.కోట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రామకుప్పం ఎంపీపీ ఎన్నిక అప్రజాస్వామికమని జడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ ఆరోపించారు.వైసీపీ ఎంపీటీసీలను కోర్టు ఆదేశాల మేరకు బందోబస్తు నడుమ బస్సులో రామకుప్పం తీసుకువెళుతుండగా పలు చోట్ల అడ్డంకులు సృష్టించి సకాలంలో రామకుప్పం వెళ్ళకుండా అడ్డుకుని కోరం లేకనే టీడీపీ వర్గానికి చెందిన వారు ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఎన్నిక చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈసీ ఈ ఎన్నికను రద్దు చేయాలని కోరారు.

చంద్రబాబు విశ్వసనీయతే రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడి!

నారా భువనేశ్వరి





జరుగు పంచాయతీలో మహిళలతో మాట్లాడుతున్న భువనేశ్వరి

కుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబుమీద రాష్ట్ర ప్రజలకు ఉన్న విశ్వాసం అపారమైనది. ఆయనమీద ఉన్న నమ్మకంతోనే పారిశ్రామికవేత్తలు ప్రతిష్ఠాత్మక పరిశ్రమలు పెట్టడానికి ఏపీకి వస్తున్నారు. ఆయనమీద పెట్టుకున్న విశ్వాసమే రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడి.' అని నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు.కుప్పం నియోజకవర్గ పర్యటనలో రెండవ రోజైన గురువారం భువనేశ్వరి కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీ, కుప్పం మండలంలోని కృష్ణదాసనపల్లె, జరుగు పంచాయతీల్లో మహిళలతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఉగాది, రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలిపిన ఆమె, గత ప్రభుత్వ వైఫల్యాలను చూచాయగా ప్రస్తావిస్తూ, చంద్రబాబు ద్వారా రాష్ట్రానికి, ప్రజలకు చేకూరుతున్న, భవిష్యత్తులో చేకూరబోయే అభివృద్ధిని గురించి ఏకరువు పెట్టారు. 'ఒక ఇండస్ట్రీ రావాలంటే ఆషామాషీ కాదు. అందుకు చాలా చేయాలి. కానీ గత ప్రభుత్వం ఏమి చేసిందో వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు తెలుసు' అని సున్నితంగా విమర్శించారు.'పారిశ్రామికవేత్తలు చంద్రబాబు మీద నమ్మకంతో ఉన్నారు. ఆయన తమకు కావాల్సిన సౌకర్యాలు కల్పించి, ప్రోత్సాహకాలు ఇస్తారని నమ్ముతున్నారు. అందుకే ఎన్నో ప్రతిష్ఠాత్మక పరిశ్రమలు ఏపీకి వస్తున్నాయి' అని స్పష్టం చేశారు.హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తిచేసి జూన్, జూలై నెలల్లోగా కుప్పానికి సాగునీరు, తాగునీరు అందిస్తారన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కుప్పం రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి భువనేశ్వరి పర్యటన ఇలా...

రామకుప్పం/శాంతిపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నారా భువనేశ్వరి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు శాంతిపురం మండలం నడింపల్లె చేరుకుని మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు.మధ్యాహ్నం 12.15 గంటలకు నక్కనపల్లె చేరుకుని మల్బరీ తోటలు, సెరికల్చర్ షెడ్లు పరిశీలిస్తారు. పట్టు రైతులతో సమావేశమై వారి సాదకబాధకాలు తెలుసుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు రామకుప్పం మండలం రాజుపేటకు వెళ్లి మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. సాయంత్రం 3.30 గంటలకు కొంగనపల్లె మహిళలతో సమావేశమవుతారు.శాంతిపురం మండలం కడపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న సొంత ఇంటి పనులను సాయంత్రం 5.15 గంటలకు పరిశీలిస్తారు.ఈ కార్యక్రమాలకు స్థానిక మహిళలు, టీడీపీ శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని శాంతిపురం, రామకుప్పం మండలాల టీడీపీ అధ్యక్షులు విశ్వనాథ నాయుడు, ఆనందరెడ్డి, ప్రధానకార్యదర్శులు నాగరాజు, నరసింహులు కోరారు.

మా ప్రాణాలు తీయడానికొచ్చిన వారిపై ఇప్పుడైనా చర్యలు తీసుకోండి

మంత్రికి వైసీపీ బాధితుల ఫిర్యాదు - చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి మంత్రి ఆదేశం



బాధితులకు న్యాయం చేయాలని డీఎస్పీకి సూచిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పుంగనూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):టీడీపీ మద్దతుదారులమని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు తమ ఇళ్లు కూల్చివేయడం, మారణాయుధాలతో దాడులకు దిగడం, అక్రమ కేసులు పెట్టడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బెంగళూరు వెళ్లిపోయి కూలీ పనులతో బిక్కుబిక్కుమని జీవించామని,ఇప్పుడైనా తమకు న్యాయం చేయాలని పలువురు బాధితులు మంత్రికి ఏకరువు పెట్టారు. పుంగనూరు మండలం కృష్ణాపురం వచ్చిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిలతో కన్నీటి పర్యంతమవుతూ నాడు వైసీపీ దాడులపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పత్రికల క్లిప్పింగ్‌లను చూపించారు.దెబ్బలు, కొడవలి పోట్లతో పాటు ఆస్తుల విధ్వంసంతో బాధితులైన తమపైనే పోలీసులు తప్పుడు కేసులు పెట్టారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణాపురానికి చెందిన ఎం.హరి, ఆయన భార్య కన్యాకుమారి మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ఐదు రోజుల ముందు టీడీపీ నుంచి మారలేదని తమపై దాడులు చేసి ఇంటి గోడ కూల్చివేశారన్నారు.ఎంబీఏ చదివే తమ కుమార్తె భాగ్యలక్ష్మి కాలు కొడవలితో నరికేశారన్నారు. తమ కుమార్తె ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా కేసుల్లో ఇరికించారని, చివరకు వివాహం చేయగా అల్లుడి వద్ద పోలీసు కేసులున్నాయని చెప్పి భార్యాభర్తలను విడదీశారని వాపోయారు.తాము పుంగనూరు పోలీసులకు ఎన్ని కేసులు ఇచ్చినా పెద్దిరెడ్డి అండతో స్టేషన్ బెయిల్‌పై వచ్చి మళ్లీ దాడులు చేసేవారని,ఇప్పటికైనా న్యాయం చేసి నిందితులను శిక్షించాలని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ఘటనతో చలించిపోయిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వెంటనే డీఎస్పీ ప్రభాకర్‌ను పిలిచి అన్ని ఆధారాలున్నాయి, ఈ కేసుల్లో నిందితులపై ఇప్పుడైనా చర్యలు తీసుకోండి, నేను ఎస్పీతో మాట్లాడతాను, విచారించి న్యాయం చేయాలని ఆదేశించారు. విచారించి నిందితులపై రౌడీషీట్ తెరుస్తామని, తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు.

రామకృష్ణ హత్యకేసులో మరో నలుగురిపై ఫిర్యాదు

వైసీపీ కార్యకర్త వెంకటరమణ చేతిలో దారుణంగా హత్యకు గురైన రామకృష్ణ కేసులో మరో నలుగురు వైసీపీ కార్యకర్తల ప్రమేయం ఉన్నట్లు మృతుడి కుమారులు గురువారం ఫిర్యాదు చేశారు. టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ద్వారా డీఎస్పీ ప్రభాకర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. హత్య కేసులో నిందితులతో సంబంధాలుండడం, అన్ని రకాల సహకారం ఇస్తున్న వైసీపీ కార్యకర్తలపై విచారించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

1334 మందికి రెండేసి ఓట్లు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1334 మందికి ఒకే ఎపిక్ సంఖ్యపై మరోచోట ఓటుహక్కు ఉన్నట్లు తాజాగా ఎన్నికల సంఘం గుర్తించింది. అర్హులైనవారికి ఓటుహక్కు కల్పించడంతో పాటు మృతులు, శాశ్వతంగా వలస వెళ్ళినవారు, డబుల్ ఎంట్రీలను తొలగించే క్రమంలో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై బీఎల్వోలు సర్వే నిర్వహించారు.మూడేళ్ళుగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బీఎల్వోలుగా బాధ్యతలు అప్పగించడం, వారిలో సగం మందికి అంతగా అనుభవం లేకపోవడం, విధుల పట్ల అంకితభావం లేకుండా నిర్లక్ష్యంగా ఉండడం వంటివి ఈ తప్పులకు ప్రధానకారణంగా ఉన్నాయి.

ఉదాహరణకు కొన్ని ....

- ఎపిక్ సంఖ్య ఏవైఎం 0343848పై మురళీకృష్ణ అనే వ్యక్తి పేరుతో చిత్తూరు అర్బన్‌లో, తిరుపతి అర్బన్‌లో ఓటు ఉంది.
- ఎస్‌క్యూబి 0575177 ఎపిక్ సంఖ్యతో సుహాసిని అనే మహిళ ఓటరుగా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఓటుహక్కు నమోదు చేసుకుంది.
- టివిఎఫ్0993262 ఎపిక్ సంఖ్యతో బి. హర్షియాకు చిత్తూరుతో పాటు పుంగనూరులో కూడా ఓటు ఉంది.

నియోజకవర్గాల వారీగా రెండేసి ఓట్లు

పుంగనూరు	287
నగరి	195
గంగాధరనెల్లూరు	133
చిత్తూరు	242
పూతలపట్టు	206
పలమనేరు	178
కుప్పం	93

సెలవురోజుల్లోనూ పనిచేయనున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరాంతం సందర్భంగా సెలవు రోజులైన ఈనెల 30, 31 తేదీల్లో అన్ని సబ్‌రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయాలు ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేస్తాయని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు.

ఎర్రచందనం కేసులో 10మందికి జైలు



శిక్ష ఖరారైన వారితో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఇతర పోలీసులు

శ్రీరంగరాజపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో పది మందికి ఆరు నెలల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.1000 వంతున జరిమానా విధించారు. ఈ మేరకు గురువారం వివరాలను కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్ మీడియాకు తెలిపారు. 2014లో ఎస్ఆర్‌పురం మండలంలోని చెరకు తోటలో దాదాపు 23 ఎర్రచందనం దుంగలను అటవీ అధికారులు సీజ్ చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి.. పుత్తూరు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. 2019లో కోర్టు నిందితులకు పైవిధంగా శిక్ష ఖరారు చేసింది. అయితే దీనిపై వారు తిరుపతి స్పెషల్ కోర్టులో అప్పీలు చేసుకున్నారు. విచారించిన న్యాయమూర్తి.. కింది కోర్టు శిక్షనే ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. శిక్ష పడినవారిలో.. ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన దిగువమూదికుప్పం కాలనీలోని ఎం.రామారావు(30), టి.సుబ్రహ్మణ్యం(30), మునస్వామి ఉపేంద్ర(27), దిగువరిపుంరాజాపురంకాలనీకి చెందిన సూలగల్లు శోభన్‌బాబు, ఎంఎంపురం కాలనీకి చెందిన ఎం.ఆర్ముగం(47), తమిళనాడు రాష్ట్రం షోలింగర్‌లోని చెందిన కె.రవి(43), పి.విజయ్‌కుమార్(32), ఎ.చిన్నప్పన్(48), తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలోని మంబక్కం సత్రంకు చెందిన వీఆర్‌పురుషోత్తం రాజు(38), పాలూరు తాలుకా తిరుణ్ణామలై జిల్లా అర్జునపురంకు చెందిన సి.వెంకటేష్(40) ఉన్నారు. నిందితులను ఎస్ఆర్‌పురం పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

ఉప ఎన్నికలు ప్రశాంతం

చిత్తూరు రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, కోఆప్షన్ స్థానాలకు గురువారం ఎన్నికలు జరిగాయి.రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకోగా మిగిలిన స్థానాలను వైసీపీ గెలుచుకుంది. తిరుపతి రూరల్ ఎంపీపీగా చంద్రమోహన్‌రెడ్డి, సదుం ఎంపీపీగా మాధవి, తవణంపల్లి ఎంపీపీగా ప్రతాప్‌సుందర్ రాయల్‌రెడ్డి, విజయపురం వైస్ ఎంపీపీగా కన్నమ్మ ఎన్నికయ్యారు. కోఆప్షన్ సభ్యులుగా పెనుమూరుకు నసీమా, పీలేరుకు సయ్యద్‌బాషాలను ఎన్నుకున్నారు.గంగవరం మండలం తాలపల్లి ఉపసర్పంచ్ ఎన్నికను కోరం లేక వాయిదా వేసినట్లు డీపీవో తెలిపారు.

4మండలాల్లో 40డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.గురువారం అత్యధికంగా నగరిలో 40.6డిగ్రీలు, గంగవరంలో 40.5, తవణంపల్లెలో 40.2, ఎస్ఆర్‌పురంలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.చిత్తూరు, గుడిపాల, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాల్లో 39.8, గుడుపల్లెలో 39.3, యాదమరిలో 39.1, గంగాధరనెల్లూరులో 38.7, నింద్రలో 38.5, బంగారుపాళ్యంలో 38.2, చౌడేపల్లి, ఐరాల, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం మండలాల్లో 38.1, రొంపిచెర్లలో 38, సోమలలో 37.3, సదుంలో 37.2, పెద్దపంజాణి, వి.కోటలో 36.9, శాంతిపురంలో 36.8, కార్వేటినగరంలో 35.8, బైరెడ్డిపల్లిలో 35.7, పలమనేరులో 35.4, రామకుప్పంలో 35.1, కుప్పంలో 34.9, పుంగనూరులో 34.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

అమర్ ఇంటికి పలువురు ఎమ్మెల్యేలు



అమరనాథరెడ్డి ఇంట్లో ఎమ్మెల్యేలు, టీడీపీ ప్రముఖులు

పలమనేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, తెలుగుదేశం పార్టీ ప్రముఖులు గురువారం పలమనేరులోని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఇంటికి వచ్చారు. ఇటీవల పుంగనూరు నియోజకవర్గంలోని చంద్రమాకులపల్లి పంచాయతీ కృష్ణాపురం గ్రామంలో టీడీపీ నాయకుడు రామకృష్ణ దారుణహత్యకు గురయ్యాడు. ఆయన కర్మక్రియలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించాలని పార్టీ ఆదేశాలతో గురువారం ఎమ్మెల్యేలు, టీడీపీ ప్రముఖ నాయకులు బయలుదేరారు. శ్రీకాళహస్తి, చంద్రగిరి, పూతలపట్టు, చిత్తూరు, ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, మురళీమోహన్, గురజాల జగన్మోహన్, జిల్లా అధ్యక్షులు సీఆర్ రాజన్, టీడీపీ నాయకులు జయప్రకాష్‌నాయుడు పలమనేరులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో కలిసి పుంగనూరుకు వెళ్లారు. కార్యక్రమంలో పలమనేరు బాలాజీ, కో ఆపరేటివ్ సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్వీబాలాజీ తదితర నాయకలు పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి ఒకరి మృతి

పుంగనూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మిద్దెపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పుంగనూరులో గురువారం ఉదయం జరిగింది. వివరాలిలా.. పట్టణంలోని తూర్పుమొగసాలకు చెందిన మసెప్ప కుమారుడు సుకుమార్(33) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేవాడు. ఉదయం గంగమ్మ వీధిలో ఊరేగింపు వెళుతుండగా మిద్దెపై నుంచి అమ్మవారిని చూస్తూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

ప్రభుత్వాస్పత్రికి వైద్య పరికరాల విరాళం



చౌడేపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాసుపత్రికి రూ.3 లక్షలు విలువ చేసే వైద్య పరికరాలను కోకాకోలా బెవరేజెస్ కంపెనీ విరాళంగా ఇచ్చినట్లు డాక్టర్ పవన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అవసరాల నిమిత్తం ఒక ఏసీ, మానిటర్, మందుల ట్రాలీ, ఓటీ హెడ్ ల్యాంప్, ఆటోక్లేవ్‌మెషిన్, హైడ్రాలిక్ ఓటీ టేబుల్ విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఉచితంగా రోగులకు, సిబ్బందికి మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కంపెనీ కోర్డినేటర్లు వినయ్ శ్రీనివాస్, జెరూషామెగిలు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు వెండి కిరీటం బహూకరణ



రొంపిచెర్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలోని గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారికి మదనపల్లె పట్టణానికి చెందిన భార్గవి ద్వారకనాధరెడ్డి దంపతులు వెండి కిరీటం, వెండి కన్నులు సమర్పించారు. వీటిని గురువారం ఆలయ పూజారి గుణశేఖర్ కు అందజేశారు. వీటి విలువ రూ.12 వేలు ఉంటుందన్నారు. అమ్మవారికి సారె పెట్టి పూజలు నిర్వహించారు.

మామిడి చెట్ల దగ్ధం

రొంపిచెర్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగచింత పంచాయతీ పెద్దమాదిగపల్లెకు చెందిన రైతులు వెంకటసిద్దయ్య, రామచంద్రయ్య పొలాల్లో 200 మామిడి చెట్లు కాలినట్లు బాధితులు గురువారం తెలిపారు. వీరి పొలాలు అటవీ ప్రాంత సమీపంలో ఉన్నందున గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి చెట్లు కాలినట్లు వాపోయారు.

ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా

గంగవరం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలం తాళ్లపల్లె ఉప సర్పంచ్ ఎన్నిక కోరం లేక వాయిదా పడినట్లు ఎన్నికల అధికారి దేదీపియ తెలిపారు. తాళ్లపల్లె ఉపసర్పంచ్ భారతి వ్యక్తిగత కారణాలతో సుమారు ఆరు నెలల క్రితం ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు ఉపసర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీచేసి గురువారం తాళ్లపల్లె పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారి దేదీపియ ఆధ్వర్యంలో వార్డుసభ్యుల సమావేశం నిర్వహించారు. తాళ్లపల్లె పంచాయతీలో 10 మంది వార్డుసభ్యులు ఉండగా.. అందులో సమావేశానికి కేవలం నలుగురు వార్డుమెంబర్లు మాత్రమే హాజరయ్యారు. దీంతో అధికారులు మధ్యాహ్నం 12 గంటల వరకు వేచిచూసి కోరం లేక వాయిదా వేసినట్లు ప్రకటించారు. కాగా శుక్రవారం 11 గంటలకు మళ్లీ ఉపసర్పంచ్ ఎన్నికకు వార్డు సభ్యులు హాజరై అభిప్రాయాన్ని తెలియజేయాలని ఎన్నికల అధికారి కోరారు.

సదుం ఎంపీపీగా మాధవి ఏకగ్రీవం



మాధవి

సదుం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సదుం ఎంపీపీగా పాలమంద ఎంపీటీసీ సభ్యురాలు మాధవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్డీవో భవాని ఆధ్వర్యంలో జరిగిన ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇటీవల మృతి చెందిన ఎంపీపీ ఎల్లప్ప స్థానంలో ఎన్నికలు నిర్వహించడంతో ఎస్సీ రిజర్వేషన్ కావడంతో ఏకైక ఎస్సీ ఎంపీటీసీగా ఉన్న మాధవి, ప్రస్తుత ప్రభుత్వ ఎంపీటీసీలు ఎవరూ లేకపోవడంతో ఆమె ఎంపికయ్యారు. ఎంపీటీసీలు , మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

కల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని పాఠశాల హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఉండాలన్నారు. పిల్లల అలవాట్లపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమన్నారు. బీడీ, సిగరెట్, హాన్స్, సిగార్, గంజాయి, మద్యం వాడటంతో కలిగే అనర్థాలపై అవగాహన ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటశిద్దులు, రాజేంద్ర, పద్మవేణి, రాజశేఖర్, గుర్రయ్య, సైదుల్లా, ఈశ్వరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల పంచాయతీకి పెరిగిన ఆదాయం




సచివాలయంలో వేలంలో పాల్గొన్న అధికారులు

సోమల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీకి ఈఏడాది వేలంతో ఆదాయం రూ.2.95 లక్షలు పెరిగింది. గురువారం స్థానిక సచివాలయంలో జరిగిన వేలంలో వారపు సంతను రూ.7.10 లక్షలకు పోకల గురుప్రకాశ్, ప్రైవేట్ బస్టాండ్‌లో గేటు వసూళ్ల రూ.90 వేలకు రాజేశ్ దక్కించుకున్నారు. గత ఏడాది కంటే రూ.2.95 లక్షలు ఆదాయం పెరిగింది. పంచాయతీలోని పలు చేపల చెరువులను వేలం వేయగా రూ. 46 వేలుకు దక్కించుకొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, సర్పంచి రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు

- రూ.36 లక్షలు ఆదాయం



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపుతో రూ.36 లక్షలు ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ హుండీ ద్వారా రూ.36,18,670 నగదు, 15 గ్రాముల బంగారు, 420 గ్రాములు వెండి, బంగ్లాదేశ్ నోటు ఒకటి, థాయ్‌ల్యాండ్ 100 బాత్ ఒక నోటును 31 రోజులలో భక్తులు అమ్మవారికి హుండీ ద్వారా సమర్పించారన్నారు. అలాగే రణబేరి గంగమ్మ ఆలయానికి హుండీ లెక్కింపుతో రూ.18,154 నగదు వచ్చిందన్నారు. ఈ ఆదాయాన్ని పుంగనూరు ఇండియన్ బ్యాంకు నందు డిపాజిట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్, ఆలయ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతులు

పుంగనూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణాపురంలో గురువారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి పలువురు రైతులు, ప్రజలు భూముల ఆన్‌లైన్ తదితర వివాదాలపై వినతులు అందించారు.

రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఇండియన్ బ్యాంకు మైక్రో సెట్ శాఖ ప్రారంభోత్సవంలో నారా భువనేశ్వరి
- స్వయం సహాయక సంఘాలకు రూ.630 కోట్లు పంపిణీ



ఇండియన్ బ్యాంకు మైక్రో సెట్ శాఖ ప్రారంభిస్తున్న భువనేశ్వరి



మహిళా సంఘాలకు పంపిణీ చేస్తున్న చెక్‌ను ప్రదర్శిస్తూ....

కుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు లింకేజీ ద్వారా ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న రుణాలను జీవితంలో ఎదగడానికి ఉపయోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి మహిళలకు సూచించారు. కుప్పంలో డిఆర్డీయే, మెప్మా ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు సేవలను అందించడంలో భాగంగా ఇండియన బ్యాంకు ఆధ్వర్యంలో మైక్రో సెట్ శాఖను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ మహిళాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. బ్యాంకు లింకేజీ ద్వారా సబ్సిడీ రుణాలను ఇస్తూ పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి దోహదం చేస్తున్నారు. ప్రతి మహిళా పొదుపును పెంచుకోవడానికి బ్యాంకు ఖాతాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఇండియన్ బ్యాంకు ఎఫ్‌ఎంజీ ఎం.రాజేశ్వర రెడ్డి మాట్లాడుతూ కుప్పంలో ఏర్పాటు చేసిన మైక్రో సెట్ శాఖ ద్వారా స్వయం సహాయక సంఘాలకు, సంఘాల సభ్యులకు ముద్ర రుణాలు, లఖ్‌పతి దీదీ రుణాలు, బంగారు నగలపై రుణాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా 160 స్వయం సహాయక సంఘాలు రూ.30 కోట్లు, ఇండియన్ బ్యాంకు తిరుపతి జోన్ ద్వారా రూ.330 కోట్లు రుణాలను భువనేశ్వరి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు డీజీఎం, తిరుపతి జోనల్ మేనేజరు సెల్వరాజ్, తిరుపతి జోనల్ ఆఫీసర్ బాలచంద్ర మోహన్, ఎల్డీఎం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేయలేదు

- అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకే టీడీపీలో చేరారు
- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



ఎంపీపీ, వైస్‌ఎంపీపీలతో కలిసి విజయ సంకేతం చూపుతున్న కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రామకుప్పం మండల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్న తలంపుతోనే ఏడుగురు వైసీపీ ఎంపీటీసీలు స్వార్వత్రిక ఎన్నికల తర్వాత టీడీపీలో చేరారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. గురువారం ఎంపీపీ, వైస్‌ఎంపీపీలుగా ఎన్నికైన సులోచన, వెంకట్రామగౌడులను ఆయన అభినందించారు. వారి ఎన్నికకు సహకరించిన ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీలో చేరిన ఎంపీటీసీలు గతంలో టీడీపీలో ఉంటూ చంద్రబాబు వెంట నడిచినవారేనన్నారు. చిన్నచిన్న సమస్యలతో వారు పార్టీకి దూరమయ్యారని.. తిరిగి పార్టీలో చేరడం తమకు సంతోషదాయకమన్నారు. వైసీపీ పెద్దలు తమ స్వార్థ ప్రయోజనాలతో ఎంపీపీ, రెండో వైస్‌ఎంపీపీ ఎన్నికలను ఐదు సార్లు వాయిదా పడేలా చేశారన్నారు. పలుమార్లు ఎన్నికలు వాయిదా పడటాన్ని ఎన్నికల కమిషన్ గుర్తించి కోరంతో పని లేకుండా ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ వెలువరించిందన్నారు. ఆ నోటిఫికేషన్ మేరకు గురువారం ఎన్నికలు జరిగాయన్నారు. వైసీపీలో మిగిలిన ఎంపీటీసీలను తాము ఎలాంటి ప్రలోభాలకు గురిచేయలేదని, వారు ఎన్నికల సమావేశానికి రాకుండా తాము ఎటువంటి అవరోధాలు కల్పించలేదని ఆయన స్పష్టం చేశారు. మీడియా సమావేశం అనంతరం ఎంపీపీ, వైస్‌ఎంపీపీలతో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఎం పీఏ మనోహర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహకార్యదర్శి డా.సురేష్‌బాబు, టీడీడీ బోర్డు సభ్యులు శాంతారాం, పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహ కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాలు, కుప్పం మున్సిపాల్టీ అధ్యక్షులు ఆనందరెడ్డి, విశ్వనాథనాయుడు, బాబునాయుడు, రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మన్ సీతాపతి, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగుదనం ఉట్టిపడేలా ఉగాది వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుతనం ఉట్టిపడేలా ఉగాది వేడుకలు నిర్వహించాలని డీఆర్వో మోహన్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన సమావేశ మందిరంలో ఉగాది పండుగ నిర్వహణపై సంబంధిత శాఖాధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ఉగాది వేడుకలు సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించేలా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారన్నారు. పంచాంగం శ్రవణం, కవిసమ్మేళనం నిర్వహించాలని సూచించారు. ప్రముఖులతో పాటు అతిథులకు ఉగాది పచ్చడి అందించనున్నట్లు చెప్పారు. తెలుగు భాషా వ్యాప్తికి ఉత్తమ సేవలు అందించిన ప్రముఖులకు నగదు బహుమతులు, సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతరకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు

పుంగనూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు గంగజాతరకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. సుగుటూరు గంగమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్న పట్టణ ప్రజలు, పోలీసులు, విద్యుత్‌శాఖ, మున్సిపల్ శాఖ, కమిటీ సభ్యులు, ఎన్‌సీసీ విద్యార్థులు సహకారం అందించారని పేర్కొన్నారు. సమావేశంలో సీఐలు రాంభూపాల్, ఉమామహేశ్వర్‌రావు, ఎస్‌ఐ లోకేశ్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ల అందజేత



క్యాలెండర్లు అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

కుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంతం వారి విశ్వావసు నామ సంవత్సరం త్రైత శకం 47వ సంవత్సరం తెలుగు యుగాది క్యాలెండర్లను గురువారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞానవేదిక కుప్పం కమిటీ అందజేసింది. ప్రాచీన తెలుగుసంస్కృతి సంప్రదాయాలకు ప్రచారం కల్పిస్తున్నందుకు భువనేశ్వరి కమిటీ ప్రతినిధులను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి కుప్పం కమిటీ అధ్యక్షుడు కృష్ణ, ప్రకాశ్, శరవణ, కృష్ణన్న, సుధాకర్, చందు, నాగరాజు, దేవరాజు, శివకృష్ణ, కృష్ణారెడ్డి, రాజకుమార్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

పుంగనూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణ పరిధిలోని పేద ముస్లిం సోదరులకు ఉచితంగా నిత్యావసర సరుకులను వాహిద్ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు సభ్యులు పంపిణీ చేశారు. గురువారం పట్టణంలోని 150 కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు హఫీజ్, అబ్దుల్‌అలీమ్, మహ్మద్, మైనార్టీ టీడీపీ నాయకులు సుహేల్ బాషా, సద్దాంహుసెన్, అనీస్, ఇబ్రహీంసాహెబ్, ఫైరోజ్, షఫీవుల్లాఖాన్, రియాజ్, అఫ్సర్‌బాషా పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



ప్రమాదాలపై శిక్షణ ఇస్తున్న ప్రవీణ్‌కుమార్

కుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని కుప్పం అగ్నిమాపకశాఖ అధికారి డి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. కుప్పం ఇండస్ట్రియల్ పార్కులోని షాహీ గార్మెంట్స్ సిబ్బందికి, మహిళా కార్మికులకు గురువారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలను నిరోధించడం, నివారించడంపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా వంట గ్యాస్ వినియోగంలో ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ కుప్పం సిబ్బంది ఎస్.రెడ్డెన్న, వి.విజయ, సి.రఘుపతి, సీకే.రామమూర్తి, బి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కళాశాల ఫీజుకు ఆర్థిక సాయం



ఫీజు చెల్లించిన బిల్లును ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

పుంగనూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదువుతున్న ఓ పేద విద్యార్థి ఫీజుకు పూర్వ విద్యార్థులు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న హరిప్రసాద్ ఫీజులు, ఇతర ఖర్చులకుగాను ప్రిన్సిపాల్ రాజశేఖర్ వద్ద ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పూర్వ విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు బైరెడ్డిపల్లె తహసీల్దార్ మాధవరాజు, హరినాథరెడ్డి, విజయశంకర్, మనోహర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘ అధ్యక్షుడిగా చెన్నకేశవులు



పుంగనూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు న్యాయవాదుల సంఘ అధ్యక్షుడుగా ఆకుల చెన్నకేశవులు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు శివప్పనాయుడు, వీరమోహన్‌రెడ్డి, సురేశ్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించగా అధ్యక్ష స్థానానికి ఆకుల చెన్నకేశవులు, ఎల్‌వీ రమణ పోటీ పడగా ఆకుల చెన్నకేశవులు 32 ఓట్ల తేడాతో గెలిపొందినట్లు ప్రకటించారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా రఘునాథరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.అరవిందకుమార్, సంయుక్త కార్యదర్శిగా జహూర్‌లు ఎన్నికైనట్లు తెలిపారు. 105 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

నాగ దేవతకు పూజలు



జరుగు గ్రామంలో నాగ దేవతలకు పూజలు చేస్తున్న భువనేశ్వరి

కుప్పం రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం జరుగు గ్రామంలో నాగ దేవతలకు నారా భువనేశ్వరి పూజలు చేశారు. రెండో రోజు పర్యటనలో భాగంగా గురువారం జరుగు పంచాయతీలో మహిళలతో ముఖాముఖిలో ఆమె పాల్గొన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు గ్రామంలోని నాగ దేవతలకు భువనేశ్వరి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,పీఎస్.మునిరత్నం, టీడీపీ కుప్పం రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కుట్టు పనిపై మహిళలకు శిక్షణ

ఐరాల(కాణిపాకం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కుట్టు పనిపై శిక్షణ తీసుకుని ఉద్యోగావకాశాలు పొందండని హీరో స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్ పరదేశి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ అగరంపల్లె కాలనీలో ఇందిరమ్మ మహిళా గార్మెంట్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంస్థ ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీల్లో నిరుపేద మహిళలకు మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు విచ్చేసే మహిళలకు స్టైఫండ్, మధ్యాహ్నం భోజన వసతి ఉంటుందన్నారు. 18-34 ఏళ్లలోపు మహిళలు ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివి ఉండాలన్నారు. శిక్షణ తీసుకున్నవారికి గార్మెంట్స్‌లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 90143 85038, 99851 83239 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.


ఆత్మీయనేతకు
జన్మదిన
శుభాకాంక్షలు
ప్రజా సమస్యల
పరిష్కారం కోసం
నిరంతరం
పాటుపడుతున్న జననేత
శ్రీ సి.వసంత్ కుమార్ గారికి
మా హార్థిక శుభాకాంక్షలు.
నారా కిరణ్
చిత్తూరు
వి.హరి
చిత్తూరు
వి.సునీల్
గార్మెంట్స్, బెంగళూరు
ఆర్.విజయ్
బెంగళూరు
బి.హరీష్
చిత్తూరు
చేతన్
బెంగళూరు


జన్మదిన శుభాకాంక్షలు
నిత్యం ప్రజలతో వుంటూ... ప్రజా సమస్యలపై ఉద్యమిస్తూ...
అందరి అదరాభిమానాలు అందుకుంటున్న మాకు అత్యంత ఆప్తులు
శ్రీ సి.వసంత్ కుమార్ గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
సి.ప్రశాంత్ @ అభి
చిత్తూరు
సి.మహేష్
చిత్తూరు
వై.దిలీప్
చిత్తూరు
ఇ.బాబు
చిత్తూరు


ఆనంద్
30వ డివిజన్,
మాజీ కార్పొరేటర్
శ్రీ సి.వసంత్ కుమార్ చౌదరి గారు
సీనియర్ టిడిపి నాయకులు, చిత్తూరు
సమాజ సేవాతత్పరతను మదినిండా నింపుకున్న
జనహృదయనేత, ఆపదలో ఆపన్న హస్తం
అందించే సహృదయులు, మృదుస్వభావి, మా శ్రేయోభిలాషి
శ్రీ సి.వసంత్ కుమార్ చౌదరి గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
జి.బి.ముస్తాక్ అహ్మద్
గంగనపల్లి


HAPPY
మా ఆత్మీయులు
శ్రీ సి.వసంత్ కుమార్ చౌదరి గారికి
మా హార్థిక
జన్మదిన శుభాకాంక్షలు
Happy
BIRTHDAY
చంద్రన్ పొన్నై
కాజూరు రాజేష్, అధ్యక్షులు
చిత్తూరు పార్లమెంటు, తెలుగుయువత

'అర్ధగిరి' హుండీ ఆదాయం రూ.6.65 లక్షలు

తవణంపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ఈవో హనుమంతరావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. 64 రోజులకు రూ.6,65,742 లభించినట్లు ఈవో తెలిపారు. అలాగే ఆలయం వద్ద క్యాంటీన్ నిర్వహణకు, చెప్పులు భద్రపరిచే లీజు హక్కుకోసం బహిరంగ వేలం నిర్వహించగా రూ.1,11,000 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

బియ్యం వితరణ

చిత్తూరు కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గంగినేని చెరువు సమీపంలోని శక్తి మారియమ్మ ఆలయానికి భక్తులు కె.వాసు, శ్రీనివాసన్, తరుణ్, శ్రీనివాసులు కలిసి నాలుగు బస్తాల బియ్యాన్ని వితరణ చేశారు. బీజేపీ నేత అట్లూరి శ్రీనివాసులు ద్వారా గురువారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు.



అర్జీదారులతో ఫోన్లో మాట్లాడుతున్న తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్

సమస్యలు పరిష్కారమయ్యాయా?

అర్జీదారులకు ఫోన్ చేసి ఆరా తీసిన తహసీల్దార్


బంగారుపాళ్యం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మీ సమస్యలు పరిష్కారమయ్యాయా? అంటూ అర్జీదారులకు ఫోన్ చేసి తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ ఆరా తీశారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను సిబ్బంది ఎంతవరకు పరిష్కరించారో గురువారం తన కార్యాలయం నుంచి బాధిత రైతులకు ఫోన్ చేసి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సీఎంకు, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపినట్లు తహసీల్దార్ చెప్పారు. ఆయనవెంట సర్వేయర్ లావణ్య, వీఆర్వోలు ఉన్నారు.

రహదారి మరమ్మతు పనుల్లో కదలిక

యాదమరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జోడిచింతల - కన్నికాపురం బోర్డర్ అంతర్రాష్ట్ర రహదారి మరమ్మతు పనుల్లో కదలిక వచ్చింది. గత వైసీపీ హయాంలో ఈ అంతర్రాష్ట్ర రహదారి దారుణంగా తయారైంది. ఎమ్మెల్యే మురళీమోహన్ చొరవతో కలెక్టర్ సుమిత్‌కుమార్ రూ.7 కోట్ల నిధులు మంజూరు చేశారు. గత ఏడాది డిసెంబరులో ఈ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. మార్చి 15వ తేదీలోగా పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదేశించారు. వేగంగా గుంతలు పూడ్చి, కంకరతోలి 50శాతం పనులు పూర్తయ్యాక నెలరోజులుగా పనులు నిలిపేశారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకల సందర్భంగా దుమ్ము, ధూళి రేగి ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. తిరిగి రెండ్రోజులుగా పనులు జరుగుతుండటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



జోడిచింతల వద్ద జోరుగా జరుగుతున్న పనులు







సత్రవాడను సారారహిత గ్రామంగా మారుద్దాం: డీఎస్పీ



స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది, పోలీసులు

నగరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నవోదయం-2లో భాగంగా సత్రవాడ దళితవాడలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రవాడను సారా రహిత గ్రామంగా మారుద్దామంటూ స్థానికులతో నగరి డీఎస్పీ అజీజ్, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, నగరి ఇన్‌చార్జి తహసీల్దారు ధనంజయలు పాల్గొన్నారు. సారా అమ్మినా, తయారు చేసినా టోల్ ఫ్రీ నెంబరు 14405కు లేదా 94409 02549 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

కాణిపాకంలో ప్రదోష కాల పూజ



మహానందికి క్షీరాభిషేకం

ఐరాల(కాణిపాకం), మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి గుడిలో గురువారం సాయంత్రం ప్రదోష కాల పూజను నిర్వహించారు. సాయంత్రం మూల విరాట్‌కు, స్వామికి ఎదురుగా ఉన్న మహానందికి అభిషేకం చేశారు. ఈ పూజలను తిలకించడానికి భారీగా భక్తులు విచ్చేశారు. అభిషేకం పూర్తయ్యాక మూల విరాట్‌ను, మహానందిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్ దంపతులు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, అర్చక, పండితులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



చిన్న మసీదులో జరిగిన ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు

చిత్తూరు కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా సంతపేటలో గురువారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. వైసీపీ నాయకుడు జ్ఞాన జగదీశ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగ్గా.. ఆపార్టీ చిత్తూరు నియోజకవర్గ కన్వీనర్ విజయానందరెడ్డి, చుడా మాజీ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, ప్రతాప్ ఎరెడ్డి, మతపెద్దలు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే బజారు వీధి చిన్నమసీదులోనూ మసీదు కమిటీ ఇఫ్తార్ విందు ఇచ్చింది. కమిటీ నాయకులు అల్తాఫ్, శేరు, మునీర్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం



చిత్తూరు కల్చరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదినం వేడుకలను నగర మెగా ఫాన్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రిలో గౌరవాధ్యక్షుడు మండి సుధ ఆధ్వర్యంలో 25 మంది రక్తదానం చేశారు. శ్రీనివాసులు, బుజ్జి, బాల, నాని, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదనం ఉట్టిపడేలా ఉగాది వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగుతనం ఉట్టిపడేలా ఉగాది వేడుకలు నిర్వహించాలని డీఆర్వో మోహన్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన సమావేశ మందిరంలో ఉగాది పండుగ నిర్వహణపై సంబంధిత శాఖాధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ఉగాది వేడుకలు సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించేలా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారన్నారు. పంచాంగం శ్రవణం, కవిసమ్మేళనం నిర్వహించాలని సూచించారు. ప్రముఖులతో పాటు అతిథులకు ఉగాది పచ్చడి అందించనున్నట్లు చెప్పారు. తెలుగు భాషా వ్యాప్తికి ఉత్తమ సేవలు అందించిన ప్రముఖులకు నగదు బహుమతులు, సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


'పురోహిత' సంఘ అధ్యక్షుడిగా మహేష్‌శర్మ


విజయపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పురోహిత బ్రాహ్మణ సమాఖ్య సంఘ అధ్యక్షుడిగా విజయపురానికి చెందిన వందవాసి మహేష్‌శర్మను గురువారం చిత్తూరులో ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు సత్కరించారు.



మహేష్‌శర్మను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు


జన్మదిన శుభాకాంక్షలు
సమాజ సేవాతత్పరతను మదినిండా
నింపుకున్న జనహృదయ నేత
శ్రీ సి.వసంత్ కుమార్ చౌదరి గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు.
శ్రీ సి.వసంత్ కుమార్ గారు
సీనియర్ టిడిపి నాయకులు, చిత్తూరు
S.S.BALAJI
CELL: 9849182444
AB HILL TOP RESORT
Restaurant
SRI SHANMUHAM AUTO GARAGE
AUTO CONSULTANTS & REAL ESTATE
BUYING, SELLING, EXCHANGE LUXURY CARS
WITH FINANCE!
9849182444


HAPPY BIRTHDAY
Happy
BIRTHDAY
Sri C.Vasanth Kumar Garu
Sr. TDP Leader, Chittoor
Best Wishes From
SAI BALAJI BUILDERS
ELECTRONIC CITY, Bangalore
THALURI LEKHI - RAMINENI SIVA
SHREEVARI GROUPS - HORAMAVU, BENGALORE


Happy Birthday!
VASANTH
ANNA
ARUN CHOWDARY


జన్మదిన శుభాకాంక్షలు
VK
నిత్యం ప్రజలతో వుంటూ, సమస్యలపై పరిష్కారం కోసం
ఉద్యమిస్తూ, అందరి ఆదరాభిమానాలు అందుకుంటున్న
మా ఆత్మీయబంధువు
శ్రీ సి.వసంత కుమార్ చౌదరి గారికి
మా హార్ధిక జన్మదిన శుభాకాంక్షలు
నవీన్
పూతలపట్టు
దిలీప్
పూతలపట్టు
శ్రీ సి. వసంత కుమార్ చౌదరి
మాజీ కార్పొరేటర్, చిత్తూరు
భూమా దయానంద్
పూతలపట్టు
రాజేంద్ర నాయుడు
పూతలపట్టు
CLOCK O AGRICULTURE PRIVATE LIMITED
No. 02, Balajyothi Arcade
Puthalapattu, Chittoor - 517 124 A.P., India
Clock'O

లేగదూడల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం

బంగారుపాళ్యం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లేగదూడల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని పాడి రైతులకు పూతలపట్టు, చంద్రగిరి ఎమ్మెల్యేలు మురళీమోహన్, పులివర్తి నాని సూచించారు. గురువారం సంక్రాంతిపల్లె పంచాయతీలోని మిట్టపల్లె గ్రామంలో సర్పంచ్ రమేష్ అధ్యక్షతన పశుసంవర్ధకశాఖ,పశుగాణాభివృద్ధి సంయుక్తంగా నిర్వహించిన లేగదూడల ప్రదర్శన ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యేలు ప్రసంగించారు. పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆరీఫ్ మాట్లాడుతూ పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధుల నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న దూడల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు, నాయకులు కోదండయాదవ్, ఎస్పీ ధరణి, జనార్దన్‌గౌడ్, లోకనాథనాయుడు, హరిబాబు, ఏడీలు ఆసీఫ్, విజయమోహన్, డాక్టర్లు ఝాన్సీ సుబ్బారావు, సిబ్బంది నాగేంద్రనాయక్, లీలావతి, తదితరులు పాల్గొన్నారు.



లేగదూడల యజమానులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యేలు మురళీమోహన్, పులివర్తి నాని, టీడీపీ నాయకులు





విద్యార్థినులు సేవాతత్వం అలవర్చుకోవాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రదీప్‌కుమార్

చిత్తూరు సెంట్రల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు సేవా తత్వం అలవర్చుకోవాలని ఎన్‌వైకే యూత్ అధికారి ప్రదీప్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి అక్తర్ సూచించారు. స్థానిక ఎన్‌పీఎస్ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ యూత్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఉషారాణి, తిరుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల జీవనోపాధులు పెరగాలి

డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు సెంట్రల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళల జీవనోపాధులు పెరగాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి సూచించారు. గురువారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో 2025-26 వార్షిక స్వయం సహాయక సంఘాల అప్పులు, జీవనోపాధుల ప్రణాళికల తయారీపై ఏపీఎం, సీసీలకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ఆర్థికాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను గ్రామ స్థాయి నుంచి సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి ఐదు సంఘాల నుంచి చురుకైన, చదువుకుని సాంకేతిక పరిజ్ఞానంపై పట్టున్న 30 ఏళ్లున్న ఓ సభ్యురాలిని ఎంపిక చేసుకుని ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. సెర్ప్ ప్రాజెక్టు మేనేజరు శ్రీనివాస్‌రావు ఏపీఎంలు, సీసీలకు దిశా నిర్దేశం చేశారు. డీపీఎంలు రవికుమార్, సుబ్బారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారులకు సరుకులు సక్రమంగా అందించండి

పాలసముద్రం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు సరుకులు సక్రమంగా అందించాలని తహసీల్దార్ అరుణకుమారి ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో డీలర్లు, ఎండీయూ వాహనదారులతో ఆమె సమావేశం నిర్వహించారు. కార్డుదారుల ఈకేవైసీ త్వరగా పూర్తిచేయాలని సూచించారు. గోడౌన్ నుంచి వచ్చే సరుకుల తూకాల్లో తేడా ఉంటోందని డీలర్లు చెప్పారు. దీనిపై గంగాధరనెల్లూరు గోడౌన్ డీటీతో ఆమె మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. డీటీ రిషివర్మ, సీఎస్‌డీటీ మోహన్‌రాజ్, ఆర్‌ఐ దేవి పాల్గొన్నారు.

పెనుమూరు కో-ఆప్షన్ సభ్యురాలిగా నసీమా

పెనుమూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండల పరిషత్‌లో కో-ఆప్షన్ సభ్యులుగా ఉన్న మురాద్ ఖాన్ ఇటీవల మరణించారు. ఈ స్థానం కోసం గురువారం ఎన్నికలు నిర్వహించారు. మురాద్‌ఖాన్ సతీమణి నామినేషన్ దాఖలు చేయడంతో ఆమెను అన్ని రాజకీయపార్టీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా తహసీల్దారు శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకుడిగా ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ రామచంద్రయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు.

జల్లికట్టులో గొడవపై కేసు నమోదు

పెనుమూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లె గ్రామంలో గత ఆదివారం జల్లికట్టు జరిగిన విషయం విదితమే. ఆరోజున కొందరు యువకులు ఘర్షణపడి ఆస్పత్రి పాలయ్యామని గురువారం పెనుమూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెదురుకుప్పం మండలం చిన్నపోటుచేనుకు పవన్ తన స్నేహితుడు మహేష్‌తో కలిసి జల్లికట్టు చూసుకుని ఇంటికి వస్తుండగా చంద్రగిరి మండలం మల్లయ్యపల్లెకి చెందిన చిరంజీవి, మునిరావన్, మునిబాబులు దారికాచి కొట్టారని ఫిర్యాదు చేశారు. జనవరిలో చంద్రగిరిలో జరిగిన జల్లికట్టులో జరిగిన చిన్న గొడవ కారణంగా తిరిగి ఆదివారం కొట్టుకున్నట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామచంద్రయ్య తెలిపారు.

రేపు అరగొండ అపోలో ఆస్పత్రిలో ఉచిత వైద్యశిబిరం

తవణంపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): అరగొండ అపోలో ఆస్పత్రిలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, పీఆర్వో కమరుద్దీన్ తెలిపారు. ప్రముఖ యూరాలజిస్ట్ ఆధ్వర్యంలో ఆ రోజున ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కిడ్నీ సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

పశువులకు నీటి తొట్టెల నిర్మాణం

వెదురుకుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో పశువులకు నీటి కొరత లేకుండా నీటి తొట్టెల నిర్మాణం పనులు చేపడుతోందని, అవసరమైన ప్రతిపాదనలను ఇవ్వాలని వెదురుకుప్పం మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ గురువారం తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఈ నీటి తొట్టెల నిర్మాణం జరుగుతుందన్నారు. అవసరమైన చోట్ల ప్రతిపాదనలను ప్రజాప్రతినిధులు ఇవ్వాలని కోరారు.

వాహనాల వేలంతో ప్రభుత్వానికి రూ.3.18 లక్షల ఆదాయం

చిత్తూరు సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.3.18 లక్షల ఆదాయం వచ్చినట్లు ఏఈఎస్ కృష్ణ కిషోర్ తెలిపారు. చిత్తూరు ఎక్సైజ్ అర్బన్, రూరల్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం స్థానిక హెడ్ పోస్టాఫీసు సమీపంలోని రీజనల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ లేబొరేటరీ ఆవరణలో వేలం నిర్వహించారు. చిత్తూరు అర్బన్ స్టేషన్ పరిధిలో వాహనాలకు రూ.2.86 లక్షలు, చిత్తూరు రూరల్ పరిధిలో వాహనాలకు రూ.32వేలు కలిపి మొత్తం రూ.3.18 లక్షల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. ఎక్సైజ్ అర్బన్ సీఐ శ్రీహరి రెడ్డి, రూరల్ సీఐ పురుషోత్తం, ఎస్‌ఐ మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లకు ముగిసిన శిక్షణ

గంగాధరనెల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పోషణ టీ - పడాయి టీ, నవచేతన, పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభం కార్యక్రమాలపై అంగన్వాడీ టీచర్లు రెండో బ్యాచ్‌కు ఇస్తున్న మూడ్రోజుల శిక్షణ గురువారంతో ముగిసింది. పలువురు అంగన్వాడీ టీచర్లు చార్టులపై వేసిన వివిధరకాల పెయింటింగ్‌లు, చార్టులతో తయారు చేసిన చొక్కాలు, గౌన్లు, టోపీలు, కలర్ పేపర్లతో చేసిన ఫ్లవర్ వాజులను ఐసీడీఎస్ ఆఫీస్ ముందుప్రదర్శించారు. సూపర్‌వైజర్ నాగరత్నమ్మ పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి: యూటీఎఫ్



సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

నగరి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):టీచర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు రాష్ట్రప్రభుత్వం తీసుకోవాలని యూటీఎఫ్ శాఖ డిమాండ్ చేసింది. జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు అధ్యక్షతన నగరిలో గురువారం జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ ప్రసంగించారు. ఇతర పాఠశాలలకు 3, 4, 5 తరగతుల విద్యార్థులను తరలించకుండా పంచాయతీల్లో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 6,7,8 తరగతుల్లో 60 మంది పైబడి విద్యార్థులుంటే యూపీ స్కూల్‌ను ఉన్నతపాఠశాలగా మార్చాలని చెప్పారు. 12 పీఆర్సీ కమిషన్‌ను తక్షణమే పునరుద్ధరించాలని, పాతపెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. అలాగే ఏప్రిల్ 14న తిరుపతిలో జరిగే విద్యాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మణిగండన్, రెడ్డెప్పనాయుడు, దీనావతి, పీఆర్ మునిరత్నం, కుప్పరాజు, బాలాజి, వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి / అంబేడ్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘాల నేతలు నిరసన


← నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

చిత్తూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా దళిత రైట్స్ మూమెంట్, ఏపీ దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక దర్గా సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఈ మేరకు నిరసన తెలిపారు. నాయకులు నాగరాజు, మహేష్, చంద్ర, గోపీనాథ్, మణి, విజయ్ కుమార్, రఘు, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె ఎంపీపీగా ప్రతాప్ రెడ్డి

తవణంపల్లె, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె ఎంపీపీగా మల్లకుంట ఎంపీటీసీ పట్నం ప్రతాప్ సుందర్ రాయల్‌రెడ్డి (ప్రతాప్ రెడ్డి)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీపీగా పనిచేస్తుండిన గోవిందరెడ్డిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు గీత తన పదవికి రాజీనామా చేయడంతో గత ఏప్రిల్ 22వ తేదీనుంచి మల్లకుంట ఎంపీపీటీ సభ్యుడు వైస్ ఎంపీపీ-2 ప్రతాప్‌రెడ్డి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాయంలో ఎన్నికల అధికారి చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. మండలంలోని వైసీపీకి చెందిన 14 మంది ఎంపీటీసీలు హాజరవగా, టీడీపీకి చెందిన తెల్లగుండ్లపల్లె ఎంపీటీసీ రవినాయుడు గైర్హాజరయ్యారు. కోరం ఉండడంతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. గోవిందరెడ్డిపల్లె ఎంపీటీసీ సభ్యురాలు గీత.. ప్రతాప్‌రెడ్డి పేరును ప్రతిపాదించగా, పుణ్యసముద్రం ఎంపీటీసీ సభ్యుడు డేవిడ్ బలపరిచారు. ఎవరూ పోటీ లేకపోవడంతో ప్రతాప్‌రెడ్డి ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందజేశారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఎంపీపీగా ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ప్రతాప్ రెడ్డి

పొలం కంచెకు నిప్పుపెట్టిన ఆకతాయిలు / దగ్ధమైన టెంకాయ, మామిడి చెట్లు


← దగ్ధమైన మామిడి చెట్లు

వెదురుకుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పొలం కంచెకు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో టెంకాయ, మామిడి చెట్లు, విద్యుత్ బోరు కేబుళ్లు దగ్ధమయ్యాయి. తిరుమలయ్యపల్లె గ్రామ పంచాయతీ కొండకిందపల్లెకు చెందిన కె.శాంతమ్మ తన ఐదెకరాల పొలంలో మామిడి, టెంకాయలు చెట్లు పెట్టింది. ఎవరో ఆకతాయిలు ఈ పొలానికి ఉన్న కంచెకు నిప్పు పెట్టారు. మంటలు చెట్లకు వ్యాపించాయి. దీంతో సుమారు 600 మామిడి చెట్లు, 20 టెంకాయ చెట్లు, రెండు బోరు మోటార్ల కేబుళ్లు కాలిపోయాయని బాధితురాలు తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరింది.

విధుల్లో అలసత్వం వహించొద్దు

పెనుమూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని ప్లానింగ్ ఆఫీసర్, మండల ప్రత్యేక అధికారి సాంబశివారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేశారు. సీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సదుపాలయాలపై ఆరా తీశారు. పెనుమూరు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు సిలబస్ పూర్తి చేశారా, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నారా గమనించారు. అనంతరం సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. సెక్రటరీ ప్రభుకిరణ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మురళి పాల్గొన్నారు.


పెనుమూరు పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న సాంబశివారెడ్డి

విజయపురం వైస్ ఎంపీపీగా కన్నమ్మ

విజయపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలంలో రెండో వైస్ ఎంపీపీగా కోసలనగరం ఎంపీటీసీ కన్నెమ్మను మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎన్నుకున్నారు. గతంలో విజయపురం ఎంపీటీసీ దశరథ రెండో వైస్ ఎంపీపీగా ఉన్నారు. అయన ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా ఎన్నిక కావడంతో వైస్ ఎంపీపీ స్థానం ఖాళీ అయ్యింది. ఎనిమిది మంది ఎంపీటీసీల్లో ఏడుగురు హాజరై చేతులెత్తడం ద్వారా వైస్ ఎంపీపీని ఎన్నుకున్నారు. ఎన్నికలను డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, ఎస్ఐ రంగా, రఘు తదితరులు ప్రశాంతంగా నిర్వహించారు. ఎన్నికైన వైస్ ఎంపీపీని వైసీపీ నాయకులు కుమారస్వామిరెడ్డి, శివరాజు, గోవర్దన్‌నాయుడు, చెంచువరప్రసాద్ గుణశేఖర్‌రెడ్డి సత్కరించారు. ఎంపీటీసీలు మంజుబాలాజీ, రాజగోపాల్, నాయకులు సతీష్‌యాదవ్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.


కన్నమ్మను సన్మానిస్తున్న నాయకులు

గంగాధర నెల్లూరు పంచాయతీకి వేలంతో రూ.5.37లక్షల ఆదాయం

గంగాధరనెల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వేలం పాట ద్వారా గంగాధరనెల్లూరు పంచాయతీకి రూ.5.37లక్షల ఆదాయం సమకూరింది. గంగాధరనెల్లూరులో గురువారం డీఎల్‌పీవో పార్వతి, సర్పంచ్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి చంద్ర నిర్వహించిన సంత వేలం పాటలో రూ.5.10లక్షలకు మండల వైస్ ఎంపీపీ హరిబాబు కైవసం చేసుకోగా, పంచాయతీ కాంప్లెక్స్ మూడో నెంబరు గదిని రూ.27,500లకు మల్లీశ్వరి దక్కించుకున్నారని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

మహాభారత ఉత్సవాలకు శ్రీకారం



పెనుమూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు ముత్యాలమ్మ ఆలయంలో మహాభారత మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. గురువారం వేదపండితులు వెదురుకొయ్యకు పూజలు చేసి.. స్వీకారకొడి స్థాపించారు. మాజీ జడ్పీటీసీ రుద్రయ్యనాయుడు, శ్రీనివాసచౌదరి, గిరి, పంగుళూరి కిషోర్, వేదపండితులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు

గంగాధరనెల్లూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవానికి నాయకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గంగాధరనెల్లూరు మండలంలోని ప్రతి పంచాయతీలోనూ అయా పంచాయతీ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు నేతలు కలిసి ఏర్పాట్లపై దృష్టి సారించారు.

అన్నదానం

చిత్తూరు రూరల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం తపోవనం ఆశ్రమంలో టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు వి.మనోహర్ అన్నదానం చేశారు. టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రదోష కాల పూజ

వెదురుకుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సమీపంలో ఉన్న శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా ప్రదోష కాల పూజ నిర్వహించారు. అలాగే నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రూ.31.98 కోట్ల మిగులుతో బడ్జెట్

అంచనాలకు కార్పొరేషన్ కౌన్సిల్ ఆమోదం

చిత్తూరు అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక సంస్థ 2025-26 సంవత్సర బడ్జెట్‌ను రూ.31.98 కోట్ల మిగులుతో అంచనాలను తయారు చేయగా గురువారం కౌన్సిల్ ఆమోదించింది. నగరపాలక సమావేశ మందిరంలో మేయర్ అముద అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. తొలుత బడ్జెట్‌లోని అంశాలను కమిషనర్ నరసింహ ప్రసాద్ సభ్యులకు వివరించారు. ప్రారంభపు నిల్వగా రూ.30.54 కోట్లు, జమల కింద రూ.277.06 కోట్లు వెరసి రాబడి రూపంలో మొత్తం రూ.307.6 కోట్లను, వ్యయ పద్దు కింద రూ.275.62 కోట్లను చూపారు. ఇందులో ఎస్సీ కులాల వారికి రూ.3.58 కోట్లు, ఎస్టీలకు రూ.1.79 కోట్లు, స్త్రీ శిశు సంక్షేమానికి రూ.1.19 కోట్లు, విభిన్న ప్రతిభావంతులకు రూ.71.67 లక్షలు, మురికివాడల అభివృద్ధికి రూ.9.55 కోట్లుగా కేటాయింపులు చేశారు. ఆదాయం పద్దులో రూ.43.50 కోట్లు నగరపాలక సంస్థకు రావచ్చని పొందుపరిచారు. ఆస్తి పన్ను, పబ్లిక్ జనరల్ ట్యాక్స్‌లో రూ.14.83కోట్ల రాబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో ఖాళీ స్థలాలపై పన్నుల రూపంలో రూ.3.59 కోట్లు, ప్రభుత్వ భవనాలపై ఆస్తి పన్నుల రూపంలో రూ.9.66 కోట్లు, నీటి ట్యాక్స్ కింద రూ. 5.93 కోట్లు, డ్రైనేజీ పన్నుగా రూ.3.94కోట్లు, లైటింగ్ పన్నుగా రూ.1.98 కోట్లు, ప్రకటనల పన్నుల రూపంలో రూ.22లక్షలు రావచ్చని అంచనాలను తయారు చేశారు. రాబడి రూపంలో స్టాంపు డ్యూటీగా ప్రభుత్వం నుంచి రూ.7 కోట్లు, వినోదపు పన్ను కింద రూ.3లక్షలు, అద్దెల ద్వారా రూ.2.78కోట్లు, యూజర్ చార్జీల కింద రూ.3.70 కోట్లు, ఇతరత్రా మొత్తం ఆదాయం రూపంలో రూ.2.78 కోట్లు రావచ్చని చూపారు. ఎంపీ ల్యాడ్స్ కింద రూ.కోటి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.70లక్షలు, అమృత్ పథకం కింద పార్కుల అభివృద్ధికి రూ.2కోట్లు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌గా రూ.2కోట్లు రావచ్చని బడ్జెట్‌లో పొందుపరిచారు.




సమావేశానికి హాజరైన చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు - ప్రసంగిస్తున్న మేయర్ అముద

కలిసికట్టుగా నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం

అధికారులతో సమన్వయం చేసుకుని కలిసికట్టుగా నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని సభ్యులకు మేయర్ అముద పిలుపునిచ్చారు. కౌన్సిల్ అత్యవసర సమావేశం గురువారం నగరపాలక సంస్థ సమావేశపు మందిరంలో మేయర్ అధ్యక్షతన జరిగింది. కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ప్రధానంగా అజెండాలోని అంశాలపై చర్చించారు. నగరంలోని కాసు బ్రహ్మానందరెడ్డి పాత బస్టాండ్ పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేయడానికి, బహుళ వాణిజ్య సముదాయాన్ని నిర్మించడానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఇచ్చిన లేఖ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారి ఆదేశాలు పొందటానికి ఆమోదించారు. కూరగాయల మార్కెట్, జంతువధశాల, ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానందరెడ్డి బస్టాండ్‌లను 2025-26 సంవత్సరానికి సంబంధించి వేలంపాటలో హెచ్చుపాటదారులకు కేటాయించడాన్ని ఆమోదించారు. అలాగే ఏఎస్ఎం, ఎంఎస్ఆర్ కాంప్లెక్సు, గిరింపేట మీ-సేవ బిల్డింగ్ పరిధిలో ఖాళీగా ఉన్న గదులను హెచ్చుపాటదారులకు కేటాయించడానికి అంగీకరించారు. టేబుల్ అజెండా ద్వారా రెడ్డిగుంట బాలాజీ హేచరీస్ ఎదురుగా ఉన్న ప్రాంతాన్ని సుందర్‌నగర్‌గా, కలెక్టరేట్ వెనుక ఉన్న ప్రాంతాన్ని సుజీవ నగర్‌గా పేరు పెట్టడానికి సభ ఆమోదించింది. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎక్స్ అఫిషియో మెంబర్ల గైర్హాజరు

బడ్జెట్ సమావేశానికి ఎక్స్ అఫిషియో మెంబర్ల హోదాలో ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీ మోహన్ పుంగనూరు పర్యటనలో వుండడం వల్ల హాజరు కాలేదు.

20 రోజుల్లో కుంకీ ఏనుగులను రప్పిస్తాం

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



గజ బాధితులకు పరిహార చెక్కులను అందజేస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు వద్ద ఎలిఫెంట్ టూరిజం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. 20 రోజుల్లో కుంకీ ఏను గులను రప్పిస్తామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో పలమనేరు ప్రాంతంలో ఏనుగుల కారణంగా నష్టపోయిన 195 మందికి పరిహార చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏనుగుల సంచారాన్ని ముందుగానే రైతులు కనుగొనేందుకు అటవీశాఖ ఓ యాప్‌ను తయారు చేస్తోందన్నారు. ఇప్పటి వరకు ఏనుగుల దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం అటవీ సరిహద్దుల్లో కందకాలు తవ్వించడం, సోలార్ విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే ఏనుగులు తెలివిగా కూల్చివేసి వాటిని దాటి వస్తున్నాయని తెలిపారు. సత్ఫలితాలు ఇస్తున్న హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్‌ను కొంతమేర ఏర్పాటు చేశారని.. పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.పలమనేరు వద్ద సంచరించే మదపుటేనుగులను అదుపు చేసేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెప్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకోసం మొసలిమడుగు సమీపంలో ఎలిఫెంట్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మరో 15 నుంచి 20 రోజుల్లో కుంకీ ఏనుగులను ఇక్కడికి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు.సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, రేంజర్ నారాయణ, సుకుమార్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

పీఈఎస్‌లో 27 వారాల శిశువుకు అధునాతన వైద్యం



తల్లీబిడ్డతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న పీఈఎస్ వైద్య ప్రముఖులు

కుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని పీఈఎస్ ఆసుపత్రిలో 27 వారాల శిశువుకు అధునాతన వైద్యం అందించి వైద్యులు ప్రాణాలు కాపాడారు. పీఈఎస్ ఆసుపత్రి చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రాజేంద్రనాయుడు, డాక్టర్ హరిచంద్ర, ఎన్ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ దీప్తిల మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ ఎన్‌కే.సుబ్రమణ్య మార్గదర్శకత్వంలో చేసిన వైద్య సేవలు విజయవంతమయ్యాయి. వైద్య ప్రముఖులు వెల్లడించిన వివరాలు ఇలా.. ఎస్ఆర్.పురం మండలం జంగాలపల్లె గ్రామానికి చెందిన రోషిణిని ఆమె భర్త మక్బుల్ ప్రసవం కోసం జనవరి 18వ తేదీన పీఈఎస్ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు రోషిణిని పరీక్షించి గర్భంలో శిశువు బరువు చాలా తక్కువ ఉందని గుర్తించారు. అయినా తల్లికి, శిశువుకు ఎలాంటి ప్రమాదం జరుగకుండా ముందస్తు ప్రసవం చేశారు. సాధారణంగా 40 వారాలు నిండిన తర్వాతనే ప్రసవం చేస్తారు. అయితే 27 వారాలకే నొప్పులు రావడంతో ఇలా ముందస్తు ప్రసవం చేయాల్సి వచ్చింది. రోషిణికి మగ శిశువు జన్మించింది. ప్రసవ సమయంలో శిశువు బరువు కేవలం 740 గ్రాములు మాత్రమే ఉంది. కానీ శిశువు అనేక రుగ్మతలు (ఇన్‌ఫెక్షన్, అధిక రక్త హీనత, శ్వాసకోశ వ్యాధులు, కంటి అభివృద్ధి లోపం, నరాల బలహీనత, అతి తక్కువ బరువు) కలిగి ఉండటంతో శిశువును వెంటనే ఎన్ఐసీయూకు తరలించి అత్యుత్తమ అధునాతన వైద్య సేవలు అందించారు. సుమారు మూడు నెలలుగా అందించిన వైద్య సేవలు ఫలించి ఇప్పుడు తల్లీ శిశువు ఆరోగ్యంగా ఉన్నారు.

ఆ రైతుల ఖాతాలకు వచ్చేనెల 30లోగా ఈకేవైసీ పూర్తిచేయండి : జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో నిరర్థకంగా ఉన్న 14వేల మంది రైతుల ఖాతాలకు వచ్చేనెల 30లోగా ఈకేవైసీ పూర్తిచేయాలని జేసీ, బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి విద్యాధరి సూచించారు. గురువారం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో పాలకవర్గ సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ.. నిరర్థక ఆస్తుల శాతాన్ని నాబార్డు ఆదేశాలతో ఐదు శాతం కంటే తగ్గించాలన్నారు. జిల్లాలో బంగారు కుదువ పెడుతున్న రైతులు ఎక్కువ సంఖ్యలో ఖాతాలు నిర్వహిస్తుంటే, వాటిపై దృష్టి సారించాలని చెప్పారు. రామకుప్పం, పెనుమూరు సింగిల్ విండోలను సమీప బ్యాంకు బ్రాంచ్‌లకు అనుసంధానం చేస్తూ తీర్మానించారు. సూపర్‌వైజర్లలో జవాబుదారీతనం మరింత పెంచేలా ఆర్బీఐ, నాబార్డు సూచనలను అమలుచేయాలని చెప్పారు. సింగిల్ విండోల కంప్యూటరీకరణ ప్రక్రియ ఆదివారంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. సీఈవో శంకర్‌బాబు మాట్లాడుతూ.. నిరర్థక ఆస్తులు రూ.90 కోట్ల నుంచి రూ.70 కోట్లకు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డీసీవో నాగవర్ధన, బ్యాంకు అధికారులు మనోహర్ గౌడ్, లిల్లీ కేథరిన్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోటాలో 1,100 టన్నుల కోత

పూర్తిగా ఇవ్వాలని ప్రభుత్వానికి లేఖ రాశామన్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రజా పంపిణీ వ్యవస్థ కుప్పకూలింది. అప్పటి వైసీపీ మద్దతుదారులైన డీలర్లు ఇష్టారాజ్యంగా నిత్యావసర వస్తువులను పక్కదారి పట్టించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో పంపిణీ చేశాక నిల్వ ఉన్న స్టాకును గుర్తించింది. ఈ మూడు నెలల్లో డీలర్ల వద్ద 1,100 టన్నుల బియ్యం ఉజ్జాయింపుగా నిల్వ ఉన్నట్లు గుర్తించింది. జిల్లాకు ప్రతినెలా 5,36,686 మంది కార్డుదారుల కోసం 8,500 టన్నుల బియ్యాన్ని కేటాయిస్తారు. అయితే డీలర్ల వద్ద ప్రభుత్వం గుర్తించిన 1,100 టన్నుల నిల్వను మినహాయించి, 7,400 టన్నుల బియ్యాన్ని ఏప్రిల్ నెలకు కేటాయించింది. అలాగే 260 టన్నుల పంచదారకుగాను ఏప్రిల్‌నెలకు 212 టన్నులు మాత్రమే కేటాయించింది. దీనిపై గురువారం 'ఆంధ్రజ్యోతి'తో జేసీ విద్యాధరి మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని చెప్పారు. జిల్లాకు కోత పెట్టిన 1,100 టన్నులను విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు.

రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీ టీడీపీ కైవసం

రామకుప్పం, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రామకుప్పం ఎంపీపీ, రెండో వైస్ ఎంపీపీ పదవులను టీడీపీ చేజిక్కించుకుంది. మూడున్నరేళ్లకు పైగా ఖాళీగా ఉన్న ఈ పదవులకు గతంలో ఐదు సార్లు ఎంపీటీసీలెవరూ హాజరుకాక పోవడంతో ఎన్నికలు వాయిదాపడ్డాయి.గురువారం ఆర్డీవో శ్రీనివాసులురాజు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. 2021లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ పోటీనుంచి వైదొలగడంతో 16 ఎంపీటీసీ స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థులే గెలిచారు. ఎంపీపీగా ఉన్న శాంతకుమారి 2021 డిసెంబరు 12న అనారోగ్యంతో మృతి చెందగా వైస్ ఎంపీపీ సుబ్రహ్మణ్యం ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.రెండో వైస్‌ఎంపీపీ పదవి తొలినుంచీ ఖాళీగానే వుంది. ఇటీవల వైసీపీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీలు టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో గురువారం నాటి ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది.ఏడుగురు ఎంపీటీసీలతో టీడీపీ , మిగిలిన 8మంది ఎంపీటీసీలతో వైసీపీ క్యాంపులు నిర్వహించాయి. టీడీపీలో చేరిన ఏడుగురు ఎంపీటీసీలు గురువారం 10గంటల ప్రాంతంలో ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన మండల సచివాలయానికి చేరుకున్నారు.మధ్యాహ్నం ఒంటిగంట దాటినా వైసీపీకి చెందిన 8మంది ఎంపీటీసీలు రాలేదు. కర్ణాటక సరిహద్దు గ్రామం రాజుపేటక్రాస్‌లో ట్రాఫిక్ స్తంభించడం, స్థానికులు అక్కడ నెలకొన్న తాగునీటి సమస్యపై రోడ్డుపై బైఠాయించడంతో పోలీస్ ఎస్కార్టుతో ఎంపీటీసీలు వస్తున్న పోలీస్ వ్యాన్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. దీంతో వారు మధ్యాహ్నం 1.25గంటల ప్రాంతంలో మండల సచివాలయానికి చేరుకున్నారు. అప్పటికే ఎంపీపీ, రెండో వైస్ ఎంపీపీ ఎన్నిక ముగిసినట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎంపీపీగా ఉస్సిగానిపల్లె ఎంపీటీసీ సులోచన పేరును విజలాపురం ఎంపీటీసీ వెంకట్రామగౌడు ప్రతిపాదించారు. సులోచన మృతో పాటు మిగిలిన ఆరుగురు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ చేతులు పైకెత్తారు. వైస్ ఎంపీపీగా విజలాపురం ఎంపీటీసీ వెంకట్రామగౌడు పేరును సింగసముద్రం ఎంపీటీసీ అశ్విని ప్రతిపాదించగా ఆయనతో బాటూ ఐదుగురు ఎంపీటీసీలు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ చేతులెత్తారు. దీంతో సులోచన ఎంపీపీగా, వెంకట్రామగౌడు రెండో వైస్ ఎంపీపీగా గెలుపొందినట్టు ఎన్నికల అధికారి డిక్లరేషన్ ఫారాలు అందజేశారు.




ఎన్నికల అధికారి శ్రీనివాసులురాజు నుంచి డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న ఎంపీపీ సులోచన, వైస్ ఎంపీపీ వెంకట్రామగౌడు

ఎంపీపీ ఎన్నిక అప్రజాస్వామికం : వైసీపీ

వి.కోట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రామకుప్పం ఎంపీపీ ఎన్నిక అప్రజాస్వామికమని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ ఆరోపించారు.వైసీపీ ఎంపీటీసీలను కోర్టు ఆదేశాల మేరకు బందోబస్తు నడుమ బస్సులో రామకుప్పం తీసుకువెళుతుండగా పలు చోట్ల అడ్డంకులు సృష్టించి సకాలంలో రామకుప్పం వెళ్ళకుండా అడ్డుకుని కోరం లేకనే టీడీపీ వర్గానికి చెందిన వారు ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఎన్నిక చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈసీ ఈ ఎన్నికను రద్దు చేయాలని కోరారు.

1334 మందికి రెండేసి ఓట్లు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1334 మందికి ఒకే ఎపిక్ సంఖ్యపై మరోచోట ఓటుహక్కు ఉన్నట్లు తాజాగా ఎన్నికల సంఘం గుర్తించింది. అర్హులైనవారికి ఓటుహక్కు కల్పించడంతో పాటు మృతులు, శాశ్వతంగా వలస వెళ్ళినవారు, డబుల్ ఎంట్రీలను తొలగించే క్రమంలో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై బీఎల్వోలు సర్వే నిర్వహించారు.మూడేళ్ళుగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బీఎల్వోలుగా బాధ్యతలు అప్పగించడం, వారిలో సగం మందికి అంతగా అనుభవం లేకపోవడం, విధుల పట్ల అంకిత భావం లేకుండా నిర్లక్ష్యంగా ఉండడం వంటివి ఈ తప్పులకు ప్రధానకారణంగా ఉన్నాయి.

ఉదాహరణకు కొన్ని ....

- ఎపిక్ సంఖ్య ఏవైఎం 0343848పై మురళీకృష్ణ అనే వ్యక్తి పేరుతో చిత్తూరు అర్బన్‌లో, తిరుపతి అర్బన్‌లో ఓటు ఉంది.
- ఎస్క్యూబి 0575177 ఎపిక్ సంఖ్యతో సుహాసిని అనే మహిళ ఓటరుగా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఓటుహక్కు నమోదు చేసుకుంది.
- టివిఎఫ్0993262 ఎపిక్ సంఖ్యతో బి. హర్షియాకు చిత్తూరుతో పాటు పుంగనూరులో కూడా ఓటు ఉంది.

నియోజకవర్గాల వారీగా రెండేసి ఓట్లు

పుంగనూరు	287
నగరి	195
గంగాధరనెల్లూరు	133
చిత్తూరు	242
పూతలపట్టు	206
పలమనేరు	178
కుప్పం	93

సెలవురోజుల్లోనూ పనిచేయనున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరాంతం సందర్భంగా సెలవు రోజులైన ఈనెల 30, 31 తేదీల్లో అన్ని సబ్‌రిజిస్ట్రార్, జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ కార్యాలయాలు ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేస్తాయని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు.

ఎర్రచందనం కేసులో 10మందికి జైలు



శిక్ష ఖరారైన వారితో కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఇతర పోలీసులు

శ్రీరంగరాజపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో పది మందికి ఆరు నెలల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.1000 వంతున జరిమానా విధించారు. ఈ మేరకు గురువారం వివరాలను కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్ మీడియాకు తెలిపారు. 2014లో ఎస్ఆర్‌పురం మండలంలోని చెరకు తోటలో దాదాపు 23 ఎర్రచందనం దుంగలను అటవీ అధికారులు సీజ్ చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి.. పుత్తూరు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. 2019లో కోర్టు నిందితులకు పైవిధంగా శిక్ష ఖరారు చేసింది. అయితే దీనిపై వారు తిరుపతి స్పెషల్ కోర్టులో అప్పీలు చేసుకున్నారు. విచారించిన న్యాయమూర్తి.. కింది కోర్టు శిక్షనే ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. శిక్ష పడినవారిలో.. ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన దిగువముదికుప్పం కాలనీలోని ఎం.రామారావు(30), టి.సుబ్రహ్మణ్యం(30), మునస్వామి ఉపేంద్ర(27), దిగువరిపుంరాజాపురంకాలనీకి చెందిన సూలగల్లు శోభన్‌బాబు, ఎంఎంపురం కాలనీకి చెందిన ఎం.ఆర్ముగం(47), తమిళనాడు రాష్ట్రం షోలింగర్‌లోని చెందిన కె.రవి(43), పి.విజయ్‌కుమార్(32), ఎ.చిన్నప్పన్(48), తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలోని మంబక్కం సత్రంకు చెందిన వీఆర్‌పురుషోత్తం రాజు(38), పాలూరు తాలుకా తిరుణ్ణామలై జిల్లా అర్జునపురంకు చెందిన సి.వెంకటేష్(40) ఉన్నారు. నిందితులను ఎస్ఆర్‌పురం పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

ఉప ఎన్నికలు ప్రశాంతం

చిత్తూరు రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, కోఆప్షన్ స్థానాలకు గురువారం ఎన్నికలు జరిగాయి.రామకుప్పం ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకోగా మిగిలిన స్థానాలను వైసీపీ గెలుచుకుంది. తిరుపతి రూరల్ ఎంపీపీగా చంద్రమోహన్‌రెడ్డి, సదుం ఎంపీపీగా మాధవి, తవణంపల్లి ఎంపీపీగా ప్రతాప్‌సుందర్ రాయల్‌రెడ్డి, విజయపురం వైస్ ఎంపీపీగా కన్నమ్మ ఎన్నికయ్యారు. కోఆప్షన్ సభ్యులుగా పెనుమూరుకు నసీమా, పీలేరుకు సయ్యద్‌బాషాలను ఎన్నుకున్నారు.గంగవరం మండలం తాలపల్లి ఉపసర్పంచ్ ఎన్నికను కోరం లేక వాయిదా వేసినట్లు డీపీవో తెలిపారు.

చంద్రబాబు విశ్వసనీయతే రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడి!

నారా భువనేశ్వరి




జరుగు పంచాయతీలో మహిళలతో మాట్లాడుతున్న భువనేశ్వరి

కుప్పం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబుమీద రాష్ట్ర ప్రజలకు ఉన్న విశ్వాసం అపారమైనది. ఆయనమీద ఉన్న నమ్మకంతోనే పారిశ్రామికవేత్తలు ప్రతిష్ఠాత్మక పరిశ్రమలు పెట్టడానికి ఏపీకి వస్తున్నారు. ఆయనమీద పెట్టుకున్న విశ్వాసమే రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడి.' అని నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు.కుప్పం నియోజకవర్గ పర్యటనలో రెండవ రోజైన గురువారం భువనేశ్వరి కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ కాలనీ, కుప్పం మండలంలోని కృష్ణదాసనపల్లె, జరుగు పంచాయతీల్లో మహిళలతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఉగాది, రంజాన్ ముందస్తు శుభాకాంక్షలు తెలిపిన ఆమె, గత ప్రభుత్వ వైఫల్యాలను చూచాయగా ప్రస్తావిస్తూ, చంద్రబాబు ద్వారా రాష్ట్రానికి, ప్రజలకు చేకూరుతున్న, భవిష్యత్తులో చేకూరబోయే అభివృద్ధిని గురించి ఏకరువు పెట్టారు. 'ఒక ఇండస్ట్రీ రావాలంటే ఆషామాషీ కాదు. అందుకు చాలా చేయాలి. కానీ గత ప్రభుత్వం ఏమి చేసిందో వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు తెలుసు' అని సున్నితంగా విమర్శించారు.'పారిశ్రామికవేత్తలు చంద్రబాబు మీద నమ్మకంతో ఉన్నారు. ఆయన తమకు కావాల్సిన సౌకర్యాలు కల్పించి, ప్రోత్సాహకాలు ఇస్తారని నమ్ముతున్నారు. అందుకే ఎన్నో ప్రతిష్ఠాత్మక పరిశ్రమలు ఏపీకి వస్తున్నాయి' అని స్పష్టం చేశారు.హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తిచేసి జూన్, జూలై నెలల్లోగా కుప్పానికి సాగునీరు, తాగునీరు అందిస్తారన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, కుప్పం రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి భువనేశ్వరి పర్యటన ఇలా...

రామకుప్పం/శాంతిపురం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నారా భువనేశ్వరి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు శాంతిపురం మండలం నడింపల్లె చేరుకుని మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు.మధ్యాహ్నం 12.15 గంటలకు నక్కనపల్లె చేరుకుని మల్బరీ తోటలు, సెరికల్చర్ షెడ్లు పరిశీలిస్తారు. పట్టు రైతులతో సమావేశమై వారి సాదకబాధకాలు తెలుసుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు రామకుప్పం మండలం రాజుపేటకు వెళ్లి మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. సాయంత్రం 3.30 గంటలకు కొంగనపల్లె మహిళలతో సమావేశమవుతారు.శాంతిపురం మండలం కడపల్లె వద్ద నిర్మాణంలో ఉన్న సొంత ఇంటి పనులను సాయంత్రం 5.15 గంటలకు పరిశీలిస్తారు.ఈ కార్యక్రమాలకు స్థానిక మహిళలు, టీడీపీ శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని శాంతిపురం, రామకుప్పం మండలాల టీడీపీ అధ్యక్షులు విశ్వనాథ నాయుడు, ఆనందరెడ్డి, ప్రధానకార్యదర్శులు నాగరాజు, నరసింహులు కోరారు.

మా ప్రాణాలు తీయడానికొచ్చిన వారిపై ఇప్పుడైనా చర్యలు తీసుకోండి

మంత్రికి వైసీపీ బాధితుల ఫిర్యాదు - చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి మంత్రి ఆదేశం

పుంగనూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి):టీడీపీ మద్దతుదారులమని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు తమ ఇళ్లు కూల్చివేయడం, మారణాయుధాలతో దాడులకు దిగడం, అక్రమ కేసులు పెట్టడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బెంగళూరు వెళ్లిపోయి కూలీ పనులతో బిక్కుబిక్కుమని జీవించామని,ఇప్పుడైనా తమకు న్యాయం చేయాలని పలువురు బాధితులు మంత్రికి ఏకరువు పెట్టారు. పుంగనూరు మండలం కృష్ణాపురం వచ్చిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిలతో కన్నీటి పర్యంతమవుతూ నాడు వైసీపీ దాడులపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పత్రికల క్లిప్పింగ్‌లను చూపించారు.దెబ్బలు, కొడవలి పోట్లతో పాటు ఆస్తుల విధ్వంసంతో బాధితులైన తమపైనే పోలీసులు తప్పుడు కేసులు పెట్టారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణాపురానికి చెందిన ఎం.హరి, ఆయన భార్య కన్యాకుమారి మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ఐదు రోజుల ముందు టీడీపీ నుంచి మారలేదని తమపై దాడులు చేసి ఇంటి గోడ కూల్చివేశారన్నారు.ఎంబీఏ చదివే తమ కుమార్తె భాగ్యలక్ష్మి కాలు కొడవలితో నరికేశారన్నారు. తమ కుమార్తె ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా కేసుల్లో ఇరికించారని, చివరకు వివాహం చేయగా అల్లుడి వద్ద పోలీసు కేసులున్నాయని చెప్పి భార్యాభర్తలను విడదీశారని వాపోయారు.తాము పుంగనూరు పోలీసులకు ఎన్ని కేసులు ఇచ్చినా పెద్దిరెడ్డి అండతో స్టేషన్ బెయిల్‌పై వచ్చి మళ్లీ దాడులు చేసేవారని,ఇప్పటికైనా న్యాయం చేసి నిందితులను శిక్షించాలని కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ఘటనతో చలించిపోయిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వెంటనే డీఎస్పీ ప్రభాకర్‌ను పిలిచి అన్ని ఆధారాలున్నాయి, ఈ కేసుల్లో నిందితులపై ఇప్పుడైనా చర్యలు తీసుకోండి, నేను ఎస్పీతో మాట్లాడతాను, విచారించి న్యాయం చేయాలని ఆదేశించారు. విచారించి నిందితులపై రౌడీషీట్ తెరుస్తామని, తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు.



బాధితులకు న్యాయం చేయాలని డీఎస్పీకి సూచిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామకృష్ణ హత్యకేసులో మరో నలుగురిపై ఫిర్యాదు

వైసీపీ కార్యకర్త వెంకటరమణ చేతిలో దారుణంగా హత్యకు గురైన రామకృష్ణ కేసులో మరో నలుగురు వైసీపీ కార్యకర్తల ప్రమేయం ఉన్నట్లు మృతుడి కుమారులు గురువారం ఫిర్యాదు చేశారు. టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ద్వారా డీఎస్పీ ప్రభాకర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. హత్య కేసులో నిందితులతో సంబంధాలుండడం, అన్ని రకాల సహకారం ఇస్తున్న వైసీపీ కార్యకర్తలపై విచారించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

4మండలాల్లో 40డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.గురువారం అత్యధికంగా నగరిలో 40.6డిగ్రీలు, గంగవరంలో 40.5, తవణంపల్లెలో 40.2, ఎస్ఆర్‌పురంలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.చిత్తూరు, గుడిపాల, పులిచెర్ల, పూతలపట్టు, వెదురుకుప్పం మండలాల్లో 39.8, గుడుపల్లెలో 39.3, యాదమరిలో 39.1, గంగాధరనెల్లూరులో 38.7, నింద్రలో 38.5, బంగారుపాళ్యంలో 38.2, చౌడేపల్లి, ఐరాల, పాలసముద్రం, పెనుమూరు, విజయపురం మండలాల్లో 38.1, రొంపిచెర్లలో 38, సోమలలో 37.3, సదుంలో 37.2, పెద్దపంజాణి, వి.కోటలో 36.9, శాంతిపురంలో 36.8, కార్వేటినగరంలో 35.8, బైరెడ్డిపల్లిలో 35.7, పలమనేరులో 35.4, రామకుప్పంలో 35.1, కుప్పంలో 34.9, పుంగనూరులో 34.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.